




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — PEN POWER TELUGU DAILY — ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 207 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 3 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 207 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 3 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను

**తాడేపల్లిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ సమావేశం**

**విలువలు, విశ్వసనీయతను నమ్మే వ్యక్తిని నేను అంటూ జగన్ ప్రసంగం**

**పార్టీ కూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నానని వెల్లడి**



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొన్నారంటూ వారిని ఆయన అభినందించారు. "మిమ్మల్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండాలని నమ్మే వ్యక్తిని. నేను అలాగే ఉంటాను, పార్టీకూడా అలాగే ఉండాలని ప్రతిక్షణం ఆశిస్తున్నాను. నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను" అని స్పష్టం చేశారు. "ఉప ఎన్నికల్లో మీరు చూసిన తెగువకు, ధైర్యానికి హాట్సాఫ్. మొత్తం 50 చోట్ల ఎన్నికలు జరిగితే, 39 స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచింది. కార్యక ర్తలు తెగింపు చూపారు. తెలుగుదేశం పార్టీకి ఈ స్థానా ల్లో ఎక్కడా గెలిచే నంబర్లు లేవు. వారికి సంఖ్యా బలం లేనే లేదు. కానీ... భయాందోళనల మధ్య ఈ ప్రభు త్వం ఎన్నికలు నిర్వహించాలనుకుంది. పోలీసుల తో భయపెట్టి, బెదిరించారు. ఇన్ని సంవత్సరాలు ముఖ్య మంత్రిగా ఉన్నానని చెప్పుకుంటున్న చంద్రబాబుకి బుద్ధిలేదు. వాస్తవంగా ఈ ఎన్నికలను టీడీపీ వదిలే యాలి. కానీ అధికార అహంకారంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చూశారు. నిజంగా ఇది ధర్మమే నా? న్యాయమేనా?" అని ప్రశ్నించారు. తిరుపతి మున్సిపల్ ఉప ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, విశా ఖపట్నంలో అవిశ్వాస తీర్మానం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని జగన్ ఆరోపించారు. రామగిరిలో 10కి తొమ్మిది ఎంపీటీసీ స్థానాలు వైసీపీ గెలుచుకున్నా ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారని, పోలీసులే ఎంపీటీసీలను కిడ్నాప్ చేస్తున్నారని ఆయన అన్నారు. బీసీ నాయకుడు లింగమయ్యను చంపేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రతి

వివరాలు 2లో..

## అనుచిత పోస్టింగ్‌లపై కేసులు నమోదు చేయడం లేదు



పెన్ పవర్ డెస్క్: సోషల్ మీడియాలో అనుచిత పోస్టింగ్‌లపై పోలీసులు కేసులు నమోదు చేయడం లేదని వైయస్ఆర్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కోర్టును ఆశ్రయించారు. సోషల్ మీడియాలో వైయస్ జగన్, తన కుటుంబ సభ్యులపై ఐ టీడీపీ అసభ్యంగా పోస్టులు పెట్టిందని ఆయన వేసిన రిట్ పిటిషన్‌పై

వివరాలు 2లో..

## ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబు...

**సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు**



- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నాగబాబు ఏకగ్రీవం
- నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించిన మండలి చైర్మన్ మోషేన్ రాజు
- సతీసమేతంగా చంద్రబాబును కలిసిన నాగబాబు

వివరాలు 2లో..

## ప్రజల్ని ఏప్రిల్ ఫూల్ చేసిన చంద్రబాబు




- ప్రతినెలా పెన్షన్ల పంపిణీ పేరుతో ఆర్భాటపు ప్రచారం
- పదినెలల్లో 3 లక్షల పెన్షన్లు కట్ చేశారు
- కూటమి పాలనపై మాజీ మంత్రి ఆర్కే రోజా ఫైర్
- అన్ని వర్గాలను నమ్మించి దారుణంగా మోసం చేస్తున్న చంద్రబాబు
- హామీల అమలు చేతకానప్పుడు సీఎం పదవి నుంచి దిగిపోవాలి
- చంద్రబాబు పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత
- డైవర్ట్ చేసేందుకే వైయస్ఆర్‌సీపీ నాయకుల మీద అక్రమ కేసులు
- మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్: నమ్మించి మోసం చేయడంలో ఆరితేరిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఏప్రిల్ ఫూల్ చేశారని మాజీ మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో

వివరాలు 2లో..

## లోక్‌సభలో వక్ఫ్ బిల్లుపై వాడీవేడిగా చర్చ...

**విపక్షాలకు దీటుగా బదులిచ్చిన అమిత్ షా**



- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రం
- చర్చకు అనుమతి ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లా
- విపక్షాల అభ్యంతరాలు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లు-2025ను కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో ప్రవేశపెట్టింది. ఈ కీలక బిల్లుపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సభలో చర్చకు అనుమతించారు. విపక్ష సభ్యుల అభ్యంతరాలు... కేంద్ర హెూంమంత్రి అమిత్ షా దీటైన సమాధానాలు...

## లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు...

**విపక్షాలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు**



- వక్ఫ్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన మంత్రి కిరణ్ రిజిజు
- బిల్లులో లేని అంశాలను లేవనెత్తి ప్రజలను విపక్షాలు తప్పుదోవ పట్టించాయన్న మంత్రి
- మైనారిటీల్లో అనవసర భయాలను సృష్టిస్తున్నారని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:వివాదస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు ఎట్టకేలకు లోక్‌సభ ముందుకు వచ్చిం ది. విపక్షాల నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం

వివరాలు 2లో..

## మధురవాడలో ప్రేమోన్మాది ఘాతుకం... హెూంమంత్రి అనిత దిగ్భ్రాంతి

- విశాఖ స్వయంకృషి నగర్ లో ఓ తల్లీకూతురుపై ప్రేమోన్మాది నవీన్ దాడి
- తల్లి లక్ష్మి మృతి... కుమార్తె దీపిక పరిస్థితి విషమం
- దీపికను ప్రేమ పేరుతో వేధిస్తున్న నవీన్

వివరాలు 2లో..



## తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను... రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా

- సీబీఎన్ పీ4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో నాంది అన్న మంత్రి
- అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ సింగిల్ టార్గెట్‌గా వెల్లడి
- కనిగిరి ప్రాంతంలోనే 50 సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న లోకేశ్
- త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటీకి శంకుస్థాపన చేస్తామని వ్యాఖ్య
- రిలయన్స్ సీబీజీ ప్లాంట్లతో 2.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలన్న మంత్రి

వివరాలు 2లో..



## శ్రీవారిని దర్శించుకున్న ముఖేశ్ అంబానీ తనయుడు ఆకాశ్

- వీఐపీ విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకున్న ఆకాశ్ అంబానీ
- దర్శనం అనంతరం వేదాశీర్వచనం అందించిన అర్చకులు
- గోపూజ చేసి గోమాతకు దాణా అందించిన ఆకాశ్ అంబానీ



పెన్ పవర్ డెస్క్:కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ దర్శించుకున్నారు. ఈరోజు ఉదయం వీఐపీ విరామ సమయంలో ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు

వివరాలు 2లో..

## సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైన టీటీడీ సమావేశం

- చంద్రబాబుతో సమావేశమైన టీటీడీ పెద్దలు బీఆర్ నాయుడు, శ్యామలరావు, వెంకన్న చౌదరి
- టీటీడీకి పలు సూచనలు చేయనున్న చంద్రబాబు
- వివిధ అంశాలను చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్న బీఆర్ నాయుడు

పెన్ పవర్ డెస్క్:సచివాలయంలో సీఎం చంద్రబాబు గారి అధ్యక్షతన టీటీడీ సమావేశం ప్రారం భమైంది. ఈ సమావేశానికి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు,ఈఓ శ్యామలరావు, జేఈవో వెంకన్న చౌదరి తదితర అధికారులు హాజరయ్యారు. వేసవి దృష్ట్యా తిరుమలలో

వివరాలు 2లో..



## క్షీణించిన లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం

- హై బ్లడ్ షుగర్ తో బాధపడుతున్న లాలూ
- ఉదయం ఆరోగ్యం విషమించినట్టు వార్తలు
- పాట్నాలోనే ఓ ఆసుపత్రిలో చేరిన వైనం

పెన్ పవర్ డెస్క్:ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితి ఈ ఉదయం క్షీణించడంతో వైద్య పరీక్షలు, చికిత్స కోసం హుటాహుటిన ఢిల్లీకి తరలించాలని భావించారు. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో ఆయనను పాట్నాలోని పరాస్ ఆసుపత్రిలో చేరారు. లాలూ ప్రసాద్ యాదవ్ గత కొంతకాలంగా హై బ్లడ్ షుగర్ తో బాధపడుతున్నారు. పాట్నాలో సాధారణ వైద్య పరీక్షలు, చికిత్స చేయించారు. అయినప్పటికీ లాలూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఇవాళ ఆయన చేతికి బ్యాండేజీ ఉండటం కనిపించింది. 2022లో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు.

వివరాలు 2లో..



## కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది

- వక్ఫ్ సవరణ బిల్లుపై సభలో చర్చ సందర్భంగా అమిత్ షా వర్సెస్ అఖిలేశ్ యాదవ్
- ప్రపంచంలోని అతిపెద్ద పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోందని అఖిలేశ్ ఎద్దేవా
- కుటుంబ పార్టీల నుంచి ఎన్నుకోవడం సులభమే అన్న అమిత్ షా
- 13 కోట్ల మంది సభ్యుల నుంచి అధ్యక్షుడి ఎన్నికకు సమయం పడుతుందని వ్యాఖ్య




పెన్ పవర్ డెస్క్:కొన్ని పార్టీల నాయకత్వం కేవలం ఐదుగురి చేతుల్లోనే ఉంటుందని, వారి నుండే అధ్యక్షుడు వస్తారని, కానీ బీజేపీలో ఒక ప్రక్రియ ఉంటుందని, 12 నుంచి 13 కోట్ల పార్టీ సభ్యుల నుంచి ఒకరిని ఎంపిక చేసుకోవాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మోడీ రిటైర్మెంట్ చర్చ-రచ్చ

ప్రధాని మోడీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయ సందర్శన దేశ రాజకీయాల్లో చర్చనీయాశంగా మారింది. బీజేపీ రాజ్యాంగం ప్రకారం 2025 సెప్టెంబర్లో మోడీ ప్రధాని పదవి నుంచి దిగిపోవచ్చని.. ఈ విషయం చెప్పేందుకు ఆయన ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిశారని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్?లో కొత్త చర్చకు తెరలేపాయి. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ మోడీ వారసుడిని ఎంపిక చేసే పనిలో నిమగ్నమైందన్న రౌత్ కామెంట్స్? బీజేపీ వర్గా?ల్లోనూ హాట్ టాపిక్?గా మారాయి. నిజంగానే మోడీ ప్రత్యమ్నాయానికి ఆర్ఎస్ఎస్ కసరత్తు మొదలుపెట్టింది..? అదే నిజం అయితే ఎవరికీ అవకాశం దక్కుతుంది..? అన్న చర్చలు ఊపందుకున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ రిటైర్ అవుతున్నారని ఉద్ధవ్ బాల్ థాకరే నేతృత్వంలోని శివసేన పార్టీ నేత సంజయ్ రౌత్ అన్నారు. “మోదీ సెప్టెంబర్ నెలలో రిటైర్ అవుతున్నారు. అందుకే ఆయన ఈ 10-11 ఏళ్లలో ఎన్నడూ లేనిది కొత్తగా ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. అక్కడే తన రిటైర్మెంట్ ప్లానింగ్ కోసం అప్లికేషన్ పెట్టుకున్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ను కలిసి టాటా బైబై చెప్పడానికే మోదీ అక్కడికి వెళ్లారు” అని సంజయ్ అభిప్రాయపడ్డారు. అంతేకాదు... దేశ నాయకత్వంలో, బీజేపి నాయకత్వంలోనూ ఆర్ఎస్ఎస్ కూడా మార్పును కోరుకుంటోంది అని మరో బాంబు పేల్చారు ప్రధానిగా మోదీ సమయం అయిపోయిందని సంజయ్ రౌత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ కూడా కేంద్రంలో, బీజేపిలో నాయకత్వ మార్పును కోరుకోవడమే అందుకు కారణంగా ఆయన చెప్పారు. మోదీ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం పర్యటన గురించి సోమవారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పుడు వాజ్‌పేయ్... ఇప్పుడు మోదీ ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాగపూర్ పర్యటనకు వచ్చారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేశవ్ బలిరాం హెగ్డేవార్ జ్ఞాపకార్థం నిర్మించిన హెగ్డేవార్ స్మృతి మందిర్‌కు వెళ్లి ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఆ సంస్థ అధినేత మోహన్ భగవత్‌ను కలిసి కాసేపు ముచ్చటించారు. ఇలా ప్రధాని స్థాయిలో ఉన్న వారు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సందర్శించడం ఇది రెండోసారి. 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి కూడా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇక్కడికి వచ్చారు. ఇప్పుడు మోదీ కూడా రావడాన్ని ఆయన రిటైర్మెంట్ ప్లాన్స్‌కు ముడిపెడుతూ సంజయ్ రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. సంజయ్ రౌత్ చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రధాని మోదీతో పాటు బీజేపి అధినాయకత్వం ఎలా స్పందిస్తుందనేదే ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఆర్ఎస్ఎస్, బీజేపి స్నేహం ఆర్ఎస్ఎస్ బీజేపీకి అనుబంధ సంస్థగా పనిచేస్తోన్న సంగతి తెలిసిందే. బీజేపిలో పెద్ద పెద్ద నాయకులుగా ఎదిగిన వారిలో చాలామంది నాయకులు ఒకప్పుడు ఆర్ఎస్ఎస్‌లో చేరి అక్కడ అంచెలంచెలుగా ఎదిగిన వారే. ముఖ్యంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపి గెలుపులో ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంతో కీలక పాత్ర పోషించిందని బీజేపి నాయకులే అంగీకరించారు. అంతేకాదు... బీజేపి నాయకత్వంపై ఆర్ఎస్ఎస్ ప్రభావం ఉంటుంది అనే విమర్శలు కూడా ఉన్నాయి. తాజాగా సంజయ్ రౌత్ వ్యాఖ్యలు కూడా అందులోంచి వచ్చినవే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మోడీ తర్వాత ప్రధాని రేసులో యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్ ముందు వరుసలో ఉన్నట్లు కమలం పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ప్రధాని పదవి.. తన రాజకీయ భవిస్యత్?పై సీఎం యోగి ఆదిత్య నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు పార్టీ హై కమాండ్ నుంచి అనుకూల సంకేతాలు ఉన్నాయా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. రాజకీయాలు నాకు పూర్తి కాల ఉద్యోగం కాదని.. నేను ఒక యోగినని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “ప్రస్తుతం నేను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని. పార్టీ హైకమాండ్ నన్ను ఉత్తరప్రదేశ్ ప్రజల కోసం ఇక్కడ ఉంచింది. రాజకీయాలు నాకు పూర్తి ఉద్యోగం కాదు. ప్రస్తుతం నేను ఇక్కడ పనిచేస్తున్నా. దీనికి కూడా ఒక కాలపరిమితి ఉంటుంది. కానీ వాస్తవానికి నేను ఒక యోగిని” అని పేర్కొన్నారు. అలాగే బీజేపీ హై కమాండ్?తో తనకు విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపైన యోగి క్లారిటీ ఇచ్చారు. బీజేపీ పెద్దలతో తనకు ఎలాంటి విభేదాలు లేవని.. అదంతా ఫేక్ ప్రచారమని కొట్టిపారేశారు. పార్టీ అధిష్టానమే నాకు సీఎం పదవి ఇచ్చింది. అలాంటప్పుడు కేంద్ర నాయకులతో నాకు విభేదాలు ఉంటే నేను ఇక్కడ సీఎం పదవిలో ఎలా ఉంటానని ప్రశ్నించారు. ప్రధాని మోడీ పీఎం హోదాలో తొలిసారి 2025, మార్చి 30న మహారాష్ట్ర నాగ్?పూర్?లోని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్ బలిరామ్ హెడ్గేవార్‌కు ఆయన నివాళు లర్పించారు. ఆర్ఎస్ఎస్ భారతదేశ సాంస్కృతిక, సైద్ధాంతిక వారసత్వాన్ని సూచించే మహా వృక్షమని అభివర్ణించారు. అలాగే.. నాగ్?పూర్?లో దివంగత ఖీూ చీఫ్ మాధవరావు సదాశివరావు గోల్వాల్కర్ అలియాస్ గురూజీ జ్ఞాపకార్థం స్థాపించిన మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్?కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు.

## ప్రజల్ని ఏప్రిల్ ఫూల్ చేసిన చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ఏ ముఖ్యమంత్రయినా ఒక పథకాన్ని ఒక్కసారే ప్రారంభిస్తారు, కానీ మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రతినెలా పెన్షన్ల ప్రారంభం అంటూ ప్రచార యావతో వెంపర్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నిజంగా పండుటాకుల పట్ల అంత ప్రేమ ఉంటే, కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ పదినెలల్లోనే దుర్మార్గంగా మూడు లక్షల పెన్షన్లను ఎందుకు తొలగించారో చంద్రబాబు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైన టీటీడీ సమావేశం

- మొదటి పేజీ తరువాయి

తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చంద్రబాబు పలు సూచనలు చేయనున్నారు. తిరుమలలో పెండింగ్ అంశాలపై చర్చించనున్నారు. సీఎం చంద్రబాబు టీటీడీ పూర్తిస్థాయి ప్రక్షాళన, అభివృద్ధి తో పాటు.... తిరుమల పవిత్రత పెంపుదలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

ఏఐ టెక్నాలజీ తో శ్రీవారి దర్శనం, వసతి తదితర సదుపాయాల కల్పన, అన్యమత ఉద్యోగులను ప్రభుత్వశాఖలకు బదిలీ చేయడం... దేశ, విదేశాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మాణం... గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం జరిగిన నిధులు కేటాయింపులు... ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు బదిలీలు తదితర కీలక అంశాలను తాము ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామని బీఆర్ నాయుడు వివరించారు.

# తప్పుడు ప్రచారాలు చేస్తే సహించను... రెడ్ బుక్ లోకి ఎక్కిస్తా

**పెన్ పవర్ డెస్క్:** సీఎం చంద్రబాబునాయుడు చెప్పిన పీ4 విధానానికి రిలయన్స్ సీబీజీ ప్లాంట్స్ నాంది కాబోతున్నాయని, పేదరికం లేకుండా చేయడంలో ఇదొక ముఖ్యమైన అడుగు కాబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యాన ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటుకు మంత్రి లోకేశ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రసంగించారు.

**నైపర్ గడ్డితో గ్యాస్**

ఎటువంటి నీటివసతి లేని మెట్టప్రాంతంలోని రైతులకు ఈ ప్లాంట్స్ ద్వారా పెద్ద ఎత్తున మేలు జరుగుతుంది. నైపర్ గడ్డితో గ్యాస్ తయారు చెయ్యబోతున్నారు. ప్రభుత్వ భూములకు 15 వేలు, రైతుల భూములకు రూ. 31 వేలు కౌలు కూడా ఇవ్వబోతున్నారు. రైతులే గడ్డి పెంచి ఇస్తే టన్నుకు నిర్ణీత ధర చెల్లిస్తారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా 110 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువు కూడా తయారు అవుతుంది. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామీణ యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు రాబోతున్నాయి. నేను ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతీ సారి మీరు చూపించే ప్రేమ, ఆప్యాయత నేను మర్చిపోలేను. ప్రకాశం జిల్లాలో పేదరికం లేకుండా చెయ్యడమే మా లక్ష్యం. రానున్న అయిదేళ్లలో ఆ లక్ష్యాన్ని సాధించి తీరుతాం.

**సీబీజీ హబ్ గా మారనున్న కనిగిరి**

ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. ఈ రంగంలో 65 వేల కోట్ల పెట్టుబడి పెట్టబోతోంది. దీని ద్వారా 500 ప్లాంట్లు పెట్టడానికి రిలయన్స్ ముందుకు వచ్చింది. తద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. ప్రకాశం, అనంతపురం, చిత్తూరు, కడపలో 5 లక్షల ఎకరాల బీడు భూమిని వినియోగంలోకి తీసుకురాబోతున్నాం. నేను యువగళం ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాను. రిలయన్స్ మొదటి సీబీజీ ప్లాంట్ ను కనిగిరిలో ప్రారంభించాను. ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చాం. కనిగిరిలో 497 ఎకరాలు కేటాయించాం. కనిగిరి ప్లాంట్ రిలయన్స్ సీబీజీ ప్లాంట్ హబ్ గా మారబోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయి.

**ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది**

ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే నాకు మొదట గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ. ఇక్కడి ప్రజలకు పౌరుషం ఎక్కువే, ప్రేమ ఎక్కువే. ప్రకాశం జిల్లా ప్రజలకు టీడీపీ అన్నా, చంద్రబాబు అన్నా ఎనలేని ప్రేమ. 2019లో ఎదురుగాలి ఉన్నా టీడీపీని నాలుగు సీట్లలో గెలిపించారు. 2024 లో 10 సీట్లలో టీడీపీ అభ్యర్థులకు ఘన విజయాన్ని చేకూర్చారు. యువగళం పాదయాత్ర చేసినప్పుడు ఇక్కడ ప్రజల కష్టాలు చూశాను. ప్రకాశం జిల్లాలో యువగళం ఒక ప్రభంజనంగా మారింది. నేను ఆ రోజే చెప్పా, మీరు చూపించిన ప్రేమకు రెండింతలు తిరిగి ఇస్తానని. ప్రకాశం జిల్లా నా గుండెల్లో ఉంటుంది అని. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కట్టు బట్టలతో మనం ప్రయాణం ప్రారంభించాం. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా ప్రకటించాం. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ఎజెండాగా పనిచేశాం. అనంతపురంను ఆటోమొబైల్ హబ్ చేశాం. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీలు తీసుకొచ్చాం. కర్నూలుకు రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీలు తీసుకొచ్చాం. ప్రకాశం జిల్లాకు అతి పెద్ద పేపర్ మిల్ తీసుకొస్తే ఆ కంపెనీని గత ప్రభుత్వం రానివ్వలేదు. ఉభయగోదావరి జిల్లాలను ఆక్వా రంగంలో నంబర్-1 గా నిలబెట్టాం. ఉత్తరాంధ్రను ఐటీ, ఫార్మా హబ్ గా తయారు చేశాం.

**గత అయిదేళ్ల పాలనంతా విధ్వంసమే!**

2019 నుంచి 2024 వరకూ ఎం జరిగిందో మీరంతా చూశారు. రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. కొత్త కంపెనీలు తీసుకురాకపోగా ఉన్న కంపెనీలను తరిమేశారు. లులూ, అమర్ రాజా, హెచ్ఎస్బీసీ, జాకీ లాంటి అనేక కంపెనీలను బెదిరించి బయటకు పంపేశారు. నేను ఆ రోజే ఛాలెంజ్ చేశా... మీరు తెచ్చిన ఒక్క కంపెనీ పేరు చెప్పండి అని. ఇప్పటి వరకూ ఆ సైడ్ నుంచి సౌండ్ లేదు. దేశంలో ఏ పార్టీ చేయని సాహసం మేం చేశాం. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పిన దమ్మున్న పార్టీ టీడీపీ. ఆ హామీ ఇచ్చే నేను అనేక మందితో మాట్లాడాను. అందరూ నీ ధైర్యం ఏంటి అని అడిగారు.

నా ధైర్యం ఒక్కటే... నా బ్రాండ్ ఒక్కటే దటీజ్ సీబీఎన్ అని చెప్పా. 2024లో సైకో పాలనకు బైబై చెప్పి రాష్ట్ర ప్రజలు ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గెలిచిన మొదటి రోజు నుంచే ఉద్యోగాల వేట మొదలుపెట్టాం. యువగళం పాదయాత్ర నాలో మార్పు తెచ్చింది. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్ర సమయంలో ఒక కుగ్రామంలో ఒక తల్లి రోడ్డుపై బోండాలు వేస్తోంది. ఆకలివేస్తోంది, బోండాలు పెట్టమని అడిగా. ఆమెను ఏం కావాలని అడిగాను. మద్యానికి బానిసై నా భర్త చనిపోయాడు, 30ఏళ్లుగా టిఫిన్ కొట్టుపెట్టుకుని జీవనం సాగిస్తున్నా. ఇద్దరు బిడ్డలను చదివిస్తున్నా, వారికి ఉద్యోగాలు కావాలని కోరింది. మరుసటిరోజే సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి మ్యానిఫెస్టోలో మొదటిహామీగా 20 లక్షల ఉద్యోగాలు పెట్టాలని కోరాను.

## మధురవాడలో ప్రేమోన్మాది ఘాతుకం... హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

**పెన్ పవర్ డెస్క్:** విశాఖపట్నం మధురవాడలో ఈ మధ్యాహ్నం ప్రేమోన్మాది ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇక్కడి స్వయంకృషి నగర్ లో ప్రేమోన్మాది ఓ తల్లీకూతురుపై కత్తి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, ఆమె కుమార్తె తీవ్రంగా గాయపడింది. మధురవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నవీన్ అనే యువకుడు డిగ్రీ చదువుతున్న దీపిక అనే యువతి ఇంటికి వెళ్లి ఆమెపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన దీపిక తల్లి లక్ష్మి (43)ని కూడా నవీన్ కత్తితో పొడవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన దీపికను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు నవీన్ కోసం గాలిస్తున్నారు. ప్రేమ పేరుతో నవీన్ గత కొంతకాలంగా దీపికను వేధిస్తున్నాడని సమాచారం. దాడి జరిగిన వెంటనే నవీన్ పరారయ్యాడు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మధురవాడలో జరిగిన ఈ ప్రేమోన్మాది దాడి ఘటనపై హోంమంత్రి అనిత తీవ్రంగా స్పందించారు. విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చితో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యువతి తల్లి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితురాలు దీపికకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రేమోన్మాదిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు.

## ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన నాగబాబు...

**పెన్ పవర్ డెస్క్:** ఇటీవల ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇవాళ నాగబాబు ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు... నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, జనసేన నేతలు హాజరయ్యారు. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని... భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని... అంటూ నాగబాబు ప్రమాణం చేశారు.

అనంతరం నాగబాబు సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నాగబాబు, పద్మజ దంపతులు సీఎం కార్యాలయానికి వెళ్లి చంద్రబాబుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు... నాగబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగబాబుకు శాలువా కప్పి, వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు.

## క్షీణించిన లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం

- మొదటి పేజీ తరువాయి

ఆయన కుమార్తె రోహిణి ఆచార్య కిడ్నీని దానం చేశారు. 2024 సెప్టెంబరులో ముంబైలో యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. 2014లో ముంబైలోని ఒక ఆసుపత్రిలో ఆయనకు ఓపెన్-హార్ట్ సర్జరీ జరిగింది.గత నెలలో లాలూ ప్రసాద్ యాదవ్ వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. మార్చి 26న ఆయన గార్డెనిబాగ్ వద్ద బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆయన బహిరంగంగా కనిపించలేదు. ఇదిలా ఉండగా, ఆర్జేడీ కార్యకర్తలు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. 2025లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులు ఆర్జేడీ ఎన్నికల వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.మాజీ రైల్వే మంత్రిగా, బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌లో పలు కులాలు, వర్గాలపై మంచి పట్టు ఉన్న రాజకీయ నేతలలో ఒకరు. ఆయన పార్టీకి మార్గనిర్దేశం చేస్తూ ఉంటారు. ఆయన అనుమతి లేకుండా పార్టీ నాయకులు ఎటువంటి నిర్ణయం తీసుకోరు. లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పటికే మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పేరును ఎన్నికల ముందు పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు.

## లోక్‌సభలో వక్ఫ్ బిల్లుపై వాడీవేడిగా చర్చ...

- మొదటి పేజీ తరువాయి

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా రూలింగ్స్ తో చర్చ వాడీవేడిగా సాగుతోంది. చర్చ సందర్భంగా రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఎన్.కె. ప్రేమచందన్ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతూ, ఇక్కడ (లోక్ సభలో) ఒరిజినల్ బిల్లుపై చర్చించడం లేదని ఆక్షేపించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి బిల్లులో కొత్త నిబంధనలను చేర్చే అధికారం ఉందా? అని ప్రశ్నించారు.రూల్ 81ని సస్పెండ్ చేయకపోతే లోక్‌సభకు కూడా కొత్త నిబంధనలను చేర్చే అధికారం లేదని ఆయన వాదించారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ సవరణలను సిఫార్సు చేయగలదు కానీ నేరుగా కొత్త నిబంధనలను చేర్చలేదని ప్రేమచందన్ స్పష్టం చేశారు.దీనికి సమాధానంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుంటూ, ప్రతిపక్షాల డిమాండ్ మేరకే బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపామని గుర్తు చేశారు. కమిటీ తన అభిప్రాయాలను తెలియజేసిందని, వాటిని క్యాబినెట్ సమీక్షించి ఆమోదించిందని చెప్పారు.ప్రతిపక్షాల అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీకి అభిప్రాయాలు చెప్పే అధికారం లేకపోతే దాని ఉనికి అర్థరహితం అవుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాదిరిగా కమిటీలు రబ్బర్ స్టాంపులు కాదని, మార్పులను అంగీకరించకపోతే కమిటీకి అర్థం లేదని షా వ్యాఖ్యానించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా వక్ఫ్ సవరణ బిల్లు 2025పై మాట్లాడుతూ... ఎం.ఎన్. కౌల్ మరియు ఎస్.ఎల్. షక్దర్ రచించిన ‘పార్లమెంటు యొక్క ఆచరణ మరియు విధానం’ అనే ప్రామాణిక గ్రంథాన్ని ఉటంకించారు. కమిటీకి విస్తృత అధికారాలు ఉంటాయని, అది బిల్లును సవరించడమే కాకుండా పునర్నిర్మించగలదని స్పష్టం చేశారు. కమిటీ బిల్లు యొక్క సారాంశం మారకుండా దాని శీర్షికను మార్చవచ్చు లేదా సంక్షిప్త పేరును కూడా ఇవ్వవచ్చు అని స్పీకర్ తెలిపారు. గతంలో ఇతర కమిటీలు కూడా ఇలాంటి సవరణలు చేశాయని ఆయన గుర్తు చేశారు.గత సంవత్సరం పార్లమెంటులో ప్రతిపక్షాల ఆందోళనల మధ్య ప్రవేశపెట్టిన ఈ బిల్లును పరిశీలన కోసం బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. ఫిబ్రవరి 13న కమిటీ తన నివేదికను సమర్పించగా, ఫిబ్రవరి 19న క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అయితే, తమ ప్రతిపాదిత సవరణలను తిరస్కరించారని, తమ అసమ్మతి గళాలను నివేదిక నుండి తొలగించారని ప్రతిపక్ష ఎంపీలు ఆరోపించారు.నివేదికల ప్రకారం, కమిటీ ఎన్డీఏ ఎంపీలు ప్రతిపాదించిన 14 మార్పులను అంగీకరించింది, అయితే ప్రతిపక్ష సభ్యులు సూచించిన 44 సవరణలను తిరస్కరించింది. చట్టానికి పేరు మార్చడం, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుకు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా నియమించడానికి అనుమతించడం, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం ఇద్దరు ముస్లిమేతర సభ్యులను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నియమించే నిబంధన చేయడం, వివాదాస్పద ఆస్తి వక్ఫ్‌కు చెందినదా... లేదా ప్రభుత్వానికి చెందినదా అని నిర్ణయించే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు ఇవ్వడం, “వక్ఫ్ బై యూజర్” అనే భావనను తొలగించడం, చట్టం ప్రారంభమైన ఆరు నెలల్లోపు ప్రతి వక్ఫ్ ఆస్తిని కేంద్ర డేటాబేస్‌లో నమోదు చేయడం, ట్రిబ్యునల్ నిర్ణయం అంతిమం అనే నిబంధనను తొలగించడం వంటి ముఖ్యమైన మార్పులు ఇందులో ఉన్నాయి.వక్ఫ్ నిర్వచనానికి నవీకరణలు చేయడం, నమోదు ప్రక్రియను క్రమబద్ధీకరించడం, వక్ఫ్ రికార్డుల నిర్వహణను మెరుగుపరచడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటివి కూడా సవరణ బిల్లులో ఉన్నాయి. వక్ఫ్ చట్టం-1995, నిర్వహణ లోపాలు, అవినీతి మరియు వక్ఫ్ ఆస్తుల ఆక్రమణ వంటి సమస్యలపై విమర్శలు ఎదుర్కొంటోంది. వక్ఫ్ అంటే ‘దాతృత్వం’ అని అర్థం. ఇది ముస్లింలు మతపరమైన, ధార్మిక లేదా ప్రైవేట్ ప్రయోజనాల కోసం విరాళంగా ఇచ్చిన వ్యక్తిగత ఆస్తి. ఒకసారి వక్ఫ్‌గా ప్రకటించిన తర్వాత, ఆస్తి యొక్క యాజమాన్యం దేవునికి చెందినదిగా పరిగణించబడుతుంది మరియు దాని స్వభావాన్ని మార్చలేము.భారతదేశంలో వక్ఫ్ ఆస్తుల పాలన వివిధ చట్టపరమైన పాలనల ద్వారా అభివృద్ధి చెందింది. ఇది 1995 నాటి వక్ఫ్ చట్టంతో ముగిసింది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులు 9.4 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్న 8.7 లక్షల ఆస్తులను నియంత్రిస్తున్నాయి. వీటి విలువ సుమారు రూ. 1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ప్రపంచంలోనే భారతదేశంలోనే అతిపెద్ద వక్ఫ్ హోల్డింగ్ ఉంది. సాయుధ దళాలు మరియు భారతీయ రైల్వేల తర్వాత ఈ వక్ఫ్ బోర్డులే దేశంలోనే అతిపెద్ద భూయజమానులుగా ఉన్నాయి.

## నేను ఏది నమ్ముతానో అదే పాటిస్తాను

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు.కుప్పంలో 16 ఎంపీటీసీ స్థానాలకు గాను 16 స్థానాలు వైసీపీ గెలుచుకుందని, అయితే ఆరుగురిని ప్రలోభాలకు గురిచేసి తీసుకెళ్లారని, మిగి లిన 9 మందిని ఎన్నికల కేంద్రానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని జగన్ ఆరోపించారు. కోరం లేకున్నా గెలిచినట్లు ప్రకటించుకున్నారని ఆయన విమర్శించారు.రాబోయే రోజుల్లో వైసీపీ అఖండ మెజార్టీతో గెలుస్తుందని, కార్యకర్తల కోసం కచ్చితంగా పార్టీ నిలబడుతుందని జగన్ అన్నారు. కోవిడ్ కారణంగా కార్యకర్తలకు తాను చేయాల్సింది చేయలేక పోయానని, జగన్ 2.0లో కార్యకర్తల కోసం గట్టిగా నిలబడతానని హామీ ఇచ్చారు.

## శ్రీవారిని దర్శించుకున్న ముఖేశ్ అంబానీ తనయుడు ఆకాశ్

- మొదటి పేజీ తరువాయి

.ఉదయం ఆలయానికి చేరుకున్న ఆకాశ్‌కు అధికారులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆకాశ్ అంబానీ తిరుమలలోని ఎస్వీ గోశాలను సందర్శించారు. గోపూజ చేసి గోమాతకు దాణా అందించారు.

## లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు...

- మొదటి పేజీ తరువాయి

మంత్రి రిజిజు మాట్లాడుతూ... మంత్రి మండలి ఆమోదం తర్వాతే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినట్టు తెలిపారు. బిల్లుపై విపక్షాలు అనవసరంగా వదంతులు ప్రచారం చేశాయని ఆరోపించారు. బిల్లులో లేని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టించాయని మంత్రి విమర్శించారు.

మైనారిటీల్లో అనవసర భయాలను సృష్టిస్తున్నారని, 1954లో మొదటిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. సవరణ బిల్లుతో ముస్లింలకు ఎలాంటి నష్టం ఉండబోదని కిరణ్ రిజిజు తెలిపారు. యూపీఏ అధికారంలో ఉంటే ఢిల్లీలోని కీలక స్థలాలు వక్ఫ్ సొంతం అయ్యేవని పేర్కొన్నారు. విలువైన భూములను కాంగ్రెస్ వక్ఫ్‌కు కట్టబెట్టిందని ఆరోపించారు. మసీదుల నిర్వహణపై ఈ చట్టం ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. వక్ఫ్ చట్ట సవరణలపై ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తామన్నారు.

## అనుచిత పోస్టింగ్‌లపై కేసులు నమోదు చేయడం లేదు

- మొదటి పేజీ తరువాయి

ఏపీ హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఇన్ పర్సన్‌గా హైకోర్టులో అంబటి రాంబాబు తన వాదనలను వినిపించారు. తాను ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేయలేదని పిటిషన్‌లో అంబటి రాంబాబు పేర్కొన్నారు. %-%పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ఫిర్యాదులు ఇచ్చాను. ఐదో ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదు. పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయడం లేదు%-% అంటూ అంబటి ప్రశ్నించారు. ఐదో ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని కోర్టును ఆయన కోరారు. దీనిపై కౌంటర్ దాఖలు చేస్తామని పోలీసుల తరఫు లాయర్ తెలిపారు. తదుపరి విచారణ రెండు వారాలకు కోర్టు వాయిదా వేసింది.

## కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుంది

- మొదటి పేజీ తరువాయి

వక్ఫ్ సవరణ బిల్లుపై లోక్‌సభలో జరుగుతోన్న చర్చలో భాగంగా సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, అమిత్ షా మధ్య వాగ్వాదం జరిగింది.ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అని చెప్పుకునే బీజేపీ తన అధ్యక్షుడిని ఎన్నుకోలేకపోతోందని అఖిలేష్ యాదవ్ ఎద్దేవా చేశారు.

అమిత్ షా స్పందిస్తూ, అఖిలేష్ నవ్వుతూ ఒక విషయం వెల్లడించారని, తాను కూడా నవ్వుతూనే సమాధానం చెబుతానని, కొన్ని పార్టీల నాయకత్వం ఐదుగురి చేతుల్లోనే ఉంటుందని, వారి నుంచి అధ్యక్షుడు వస్తారని కౌంటర్ ఇచ్చారు.ఐదుగురి నుంచే అధ్యక్షుడిని తీసుకుంటారు కాబట్టి మీకు సమయం పట్టదని చురక అంటించారు. మరో పాతికేళ్లు మీరే అధ్యక్షుడిగా కొనసాగుతారని అన్నారు. అందులో మార్పు ఉండదని పేర్కొన్నారు. కోట్లాది మంది నుంచి తాము అధ్యక్షుడిని ఎంపిక చేసుకోవాలి కాబట్టి తమకు సమయం పడుతుందని చెప్పారు.

## కర్నూలు-విజయవాడ మధ్య విమాన సర్వీసులు ప్రారంభించండి : మంత్రి టీజీ భరత్



**న్యూఢిల్లీ. పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన టిజి భరత్. కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి కర్నూలు - విజయవాడ విమాన సౌకర్యంపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని కేంద్ర మంత్రి తెలిపినట్లు టి.జి భరత్ చెప్పారు. త్వరలోనే దీనికి సంబంధించి అడుగులు పడే అవకాశం ఉందని చెప్పారన్నారు. కర్నూలు - విజయవాడ విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. విమాన సర్వీసు కూడా అందుబాటులోకి వస్తే పారిశ్రామికవేత్తల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

# పెన్ పవర్
## వై.ఎస్.ఆర్. కడప అన్నమయ్య జిల్లా

## కడప జిల్లా వ్యాప్తంగా 16 మంది సబ్ ఇన్స్పెక్టర్లు బదిలీలు..




**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** ఎస్ ఐ లను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాలు జారి.

కడప ఎస్‌బిలో ఉన్న హైమావతి జమ్మలమడుగు ఎస్ఐగా బదిలీ..

జమ్మలమడుగు ఎస్ఐగా ఉన్న కల్పన కడప ఎస్‌బికి బదిలీ..

సింహాద్రిపురం ఎస్సైగా ఉన్న తులసినాగ ప్రసాద్ కడప తాలూకా ఎస్సైగా బదిలీ చేయగా ఇక్కడ పనిచేస్తున్న ప్రదీప్ నాయుడు ఎస్బి కి బదిలీ...

తొండూరు ఎస్సైగా ఉన్న పెద్దఓబన్న వల్లూరు ఎస్సైగా బదిలీ..

ఎస్బి లో ఉన్న ఎస్ఐ అరుణ్ రెడ్డి ప్రొద్దుటూరు రూరల్ ఎస్సైగా బదిలీ..

కలమల్ల ఎస్సై ఉన్న మహమ్మద్ రఫీ సిద్దవటం ఎస్ఐగా బదిలీ..

కలమల్ల ఎస్సైగా ఉన్న తిమోతి కలసపాడు ఎస్సైగా బదిలీ..

కలసపాడు ఎస్ఐ ఘన మద్దిలేటి తొండూరు ఎస్సైగా బదిలీ...

రిమ్స్ ఎస్సై జయరాములు కలమల్ల ఎస్సైగా బదిలీ...

ఎస్బి లో ఉన్న మల్లికార్జున రెడ్డి కడప వన్ టౌన్ ఎస్ఐగా బదిలీ...

బద్వేలు అర్బన్ ఎస్ఐగా ఉన్న రవికుమార్ సింహాద్రిపురం ఎస్ఐగా బదిలీ...

కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ కమలాపురం ఎస్సైగా బదిలీ చేయగా కమలాపురం ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కొండాపురం ఎస్సైగా బదిలీ అయ్యారు...

కడప వి.ఆర్‌లో ఉన్న ఎస్సై జయరాంరెడ్డి బద్వేల్ అర్బన్ ఎస్సైగా బదిలీ...

కడప విఆర్‌లో ఉన్న ఎస్ఎస్ శ్రీనివాసులు ఎస్బి ఎస్ఐగా పోస్టింగ్...

## రక్షణ రంగంలో పెండింగ్ ప్రాజెక్టులు

# త్వరగా పూర్తి చేయండి

### ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన టి.జి.భరత్





**న్యూఢిల్లీ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** ఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను మంత్రి టి.జి భరత్ కలిశారు. ప్రాజెక్టుల పురోగతిపై చర్చించిన మంత్రి. ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల పనులు చురుగ్గా కొనసాగించాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై ఆయన చర్చించారు. పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. రక్షణ రంగానికి సంబంధించిన ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ సానుకూలంగా స్పందించినట్లు టి.జి భరత్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని ఇరువురి మధ్య చర్చ వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎన్నో ఏళ్ల నుండి ఉన్న అనుబంధాన్ని కేంద్ర మంత్రి గుర్తుచేశారని చెప్పారు.

ఇక ఏపీకి సంబంధించిన ప్రాజెక్టులపై పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటానని రాజ్ నాథ్ సింగ్ హామీ ఇచ్చినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అధికారులతో సమీక్షిస్తానని రాజ్ నాథ్ సింగ్ చెప్పారన్నారు. ఏపీలో ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని టి.జి భరత్ అన్నారు. పెట్టుబడిదారులతో నిత్యం సమీక్షిస్తూ ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు.

## 340సి జాతీయ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేస్తాం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**పాములపాడు/నంద్యాల పెన్ పవర్ ఏప్రిల్ 02 :** ఎన్‌హెచ్‌ఏఐ చేపడుతున్న 340-సి జాతీయ రహదారుల నిర్మాణంలో తలెత్తిన భూ సేకరణ, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించి పెండింగ్ లో ఉన్న రహదారి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం పాములపాడు మండలం రుద్రవరం, జూటూరు గ్రామాల మీదుగా వెళ్లే 340సి జాతీయ రహదారుల పనులలో తలెత్తిన అడ్డంకులపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ లతో కలిసి రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు అడ్డంకిగా ఉన్న స్ట్రక్చర్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కర్నూలు నుండి ఆత్మకూరు 340-సి జాతీయ రహదారి నిర్మాణ పనులు వచ్చిన అడ్డంకులను తొలగించి రహదారి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. పాములపాడు మండలం చెలిమెల్ల గ్రామ సమీపంలో రహదారి నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న 600 మీటర్ల పరిధిలో వున్న నిర్మాణాలు, ఇతర భూ సేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించి రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారుల పనులు పూర్తయితే తరువాయి 5లో..

## వేసవి కాలంలో పశువులు, మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు

# 300 పశువుల నీటి తొట్టెల నిర్మాణం

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా






**కర్నూలు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** వేసవి కాలంలో పశువులు,మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 300 పశువుల నీటి తొట్టెలను నిర్మించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ శివార్లలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి జిల్లా కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో గ్రామాల్లో పశువులు, గొర్రెలు,మేకలు తదితర మూగ జీవాలకు తాగునీటి కోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటి తొట్టె లను నిర్మించడం జరుగుతోందని, ఇందులో భాగంగా జిల్లాలో 300 నీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు..ఒక్కొక్క నీటి తొట్టె కు 34 వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఉపాధి హామీ నిధులతో వీటిని నిర్మించడం జరుగుతోందని, ఏప్రిల్ 10 వ తేది లోపు వీటి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వేసవిలో వీటిని సంపూర్ణంగా వినియోగించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, నీటి సంరక్షణ పనులతో పాటు వేసవి కాలంలో మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పశువుల దాహం తీర్చడానికి ప్రభుత్వం నీటి తొట్టె లను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి వెంకట రమణయ్య, కర్నూల్ రూరల్ తహసిల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటా


### - జిల్లా ఏస్పీ విద్యాసాగర్ నాయుడు



**అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని పెనగలూరు మండల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ 2002 బ్యాచ్ హెడ్ కానిస్టేబుల్ (404) నీరుకట్ట గురుమూర్తి, 24-2-2025 వ తేదీన గుండెపోటుతో మరణించారు. మృతుడు గురుమూర్తి సతీమణి ఎన్. అమరావతికి ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ నుండి రూ.1,00, 000, ఒక లక్ష రూపాయలు చెక్కును జిల్లా ఎస్పీ .వి.విద్యాసాగర్ నాయుడు ఐపీఎస్, జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు బుధవారం అందజేశారు. జిల్లా ఏస్పీ విద్యాసాగర్ నాయుడు, మృతుడు హెడ్ కానిస్టేబుల్ సతీమణి మరియు వారి కుటుంబ సభ్యులతో వారి పిల్లల చదువుల గురించి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. మనం అందరం ఒక పోలీసు కుటుంబమని ఏదైనా సమస్య వచ్చిన, ఏ సహాయం కావాలన్నా తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. వాటిపై తక్షణం స్పందించి ఆ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణుడు, మృతుడి భార్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు నాయకుడుగా వ్యవహరించడం లేదు

### - మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి



**ధర్మవరం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** చంద్రబాబు నాయకుడిలా వ్యవహరించడం లేదని జగన్ అన్నారు. హామీల విష యంలో ప్రజలను మోసం చేశారని, చంద్రబాబు పాలన లో అన్నీ అబద్ధాలు, మోసాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో.. చిన్న పదవి కోసం దారుణాలు చేశారని జగన్ అన్నారు. కళ్లు మూసుకుంటే మూడేళ్లు గడిచిపోతాయని, చంద్రబాబు మోసాలు క్లైమాక్స్‌కు చేరాయ న్నారు. భారీ మెజార్టీతో వైసీపీ గెలుపు ఖాయమన్నారు. కరోనా కారణంగా కార్యకర్తలకు చేయాల్సినంత చేయలేదన్నారు. జగన్ 2.0 భిన్నం.. కార్యకర్తల కోసం నిలబడతామని జగన్ అన్నారు.

## సచివాలయ సేవలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా


**కర్నూలు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని బి.క్యాంప్‌లో 56వ వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా సచివాలయం





సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తూ సిబ్బంది హాజరు తో పాటు వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలను త్వరితగతిన అందించాలని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రజలకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు..

# సచివాలయ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్, కలెక్టర్, ఎమ్మెల్యేలు



**కడప, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అని, ఉన్నవూరు, సొంత ప్రాంతాన్ని చక్కబెడితే.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే అని.. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అభివర్ణించారు. బుధవారం ప్రొద్దుటూరు మండలం కానపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా గ్రామ సచివాలయ భవనానికి జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ప్రారంభోత్సవం చేయగా, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలిసి మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పల్లెసీమల ప్రగతికి గ్రామ సచివాలయాలే ఆయువు పట్టు అని తెలుపుతూ.. సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్ష్యం అన్నారు. అదే నిజాన్ని నమ్మిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ.. ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక స్థితిని ప్రస్తుతం 4వ స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు.

అదే బాటలో నడుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 విధానం ద్వారా.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం.. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తల సమన్వయ సహకారంతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజల ఇంటి ముంగిటే గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అన్ని రకాల విస్తృతమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సహకారంతో వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. సేవలను మరింత విస్తృతం చేస్తూ.. ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తోం దన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరంగా తన వంతు సహకారాన్ని అందించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. చడంలో రాష్ట్రంలోనే ప్రతిష్టా త్మకమైన, సంపన్నమైన పట్టణంగా ప్రొద్దుటూరు అభివృద్ధి చెందుతోందన్నారు. అలాంటి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను సంతృప్తి కరంగా అందిస్తోందన్నారు. పేదరిక నిర్మూలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 విధానం ద్వారా.. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఇంకనూ పేదలుగా మిగిలి ఉన్న కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం



ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి, అధికారి, ఆర్థిక సంపన్నులు తమవంతు బాధ్యతను తీసుకోవాలన్నారు. సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు ఎంతో కొంత శక్తి సామర్థ్యాలను అవసరమున్న మేరకు ఇతరులకు అనుసంధానం చేసి పీ 4 విధానాన్ని సఫలీకృతం చేయాలన్నారు. విద్య ఆరోగ్య ఆర్థిక జీవనోపాధిలో వృద్ధి సాధించి పేదరికం నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రొద్దుటూరు నియోజకవర్గం ముందంజలో నడుస్తోందని చెప్పడానికి గర్విస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా గ్రామ సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పని చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివా లయాలు రాష్ట్రాభివృద్ధికి ప్రమాణికాలుగా నిలిచాయన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఒకే ప్రాంగణంలో గ్రామీణ ప్రజలకు తరువాయి 5లో..

# కలెక్టరేట్ లో ఘనంగా పదవీ విరమణ ఉద్యోగుల ఆత్మీయ అభినందన సన్మాన సభ

### - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 01 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో మంగళవారం సాయంత్రం పదవీ విరమణ ఉద్యోగుల ఆత్మీయ అభినందన సన్మాన సభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి డి ఆర్ఓ ఏ.మలోల ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు పదవీ విరమణ చేస్తున్న అధికారులు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సామూహికంగా నిర్వహించిన పదవీ విరమణ మహోత్సవం జీవితకాలం గుర్తించుకునే అరుదైన కార్యక్రమం అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ ఆరోగ్యం బాగుండాలని, వారంతా వారి అలవాట్లు, కుటుంబ సభ్యుల పట్ల నిర్వర్తించాల్సిన కర్తవ్యాలను నెరవేర్చుకోవాలని, ప్రతిరోజు వ్యాయామాలను చేసుకుంటూ మంచి ఆరోగ్యాంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం భగవంతుడు ప్రసాదించాలని కోరుకున్నారు. పదవీ విరమణ పొందిన వారికి ఘన సన్మానం.. శాలువా, ఒక మొక్క, మెమొంటో అందజేత. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, సర్వే ఏడి రూపుల నాయక్, రిజిస్టర్ భార్గవ్, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, వివిధ శాఖల అధికారులు, పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.







## జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్‌పర్సన్‌గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ బాధ్యతల స్వీకరణ



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** అనంతపురం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ బాధ్యతలను స్వీకరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలకు సంబంధించిన వ్యవహారాలను నిర్వహించడానికి జిల్లాల జాయింట్ కలెక్టర్‌లను పర్సన్-ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ గా జాయింట్ కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయం సంస్థ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ & జాయింట్ కలెక్టర్‌ని గ్రంథాలయం సంస్థ సెక్రెటరీ రమ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## సిసిఎల్ఏ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్వో




**కర్నూలు, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** విజయవాడ నుండి సిసిఎల్ఏ జిల్లా కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్వో.

## ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

### ప్రిన్సిపాల్ మహాలక్ష్మి



**ధర్మవరం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు మల్లికార్జున ప్రభాకర్ పెద్దన్న తదితరులు మండల పరిధిలోని పలు గ్రామాలలో, పట్టణంలోని ముఖ్యమైన కూడలిలలో వారు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహాలక్ష్మి మాట్లాడుతూ నైపుణ్యం, అనుభవం గల అధ్యాపకులచే విద్యా బోధన జరుపుతున్నామని, ప్రతి సంవత్సరం మంచి ఫలితాలను వస్తూ పట్టణములో ఓ మంచి గుర్తింపు కలిగిన పాఠశాలగా ఉందని వారు తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజుల బెడద ఉంటుందని, అదే ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం ద్వారా ఎటువంటి డబ్బు తీసుకోకుండా ఉత్తమమైన బోధనను బోధించడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు కూడా వర్తించడం జరుగుతుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడలు, యోగ, ఆరోగ్యంలాంటి వాళ్ళ విషయాలను కూడా కళాశాలలో నేర్పించడం జరుగుతుందన్నారు. కావున పదవ తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులను తల్లిదండ్రులు మా ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ కు, ద్వితీయ సంవత్సరానికి చేర్పించాలని వారు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహించడం జరుగుతుందని, తద్వారా మా కళాశాలలో బాలికల సంఖ్య పెంచేందుకు తాము కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

## గిన్నిసు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు “మెప్మా”కు చోటు




**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా విజయవాడ నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ మరియు వరల్డ్ రికార్డు యూనియన్ వారు వైయస్సార్ కడప జిల్లాకుఅందచేసిన 3 రకాల ప్రపంచ రికార్డులను కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం మెప్మా పీడీ కిరణ్ కుమార్, సిబ్బందితో కలిసి అందుకోవడం జరిగింది.

**వివరాలు :** స్వయం సహాయక సంఘ సభ్యులు ఉత్పతులతో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహ సంస్థలు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోవడానికి, మార్కెట్ లో వృద్ధి చెందడానికి సమగ్ర డిజిటల్ ప్లాట్ ఫారమ్ ను అందించడం తద్వారా “ఆర్థిక వృద్ధి మరియు సుస్థిర జీవనోపాధిని ఏర్పరచుకొని, సాధికారత ను సాధించడం” ముఖ్య ఉదేశ్యం. మెప్మా - పట్టణాలలోని స్వయం సహాయక సంఘ సభ్యుల ఉత్పత్తుల నాణ్యతను పెంచి, వాటికి అవసరమైన స్టాండర్డ్స్ ను ఏర్పాటుచేసి, ప్యాకేజింగ్ మరియు బ్రాండింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయుటకు నిపుణులైన సంస్థలతో మెప్మా సంస్థ అనుసంధానమై పనిచేస్తున్నది.

**లక్ష్యం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 సందర్భంగా మార్చి 8వ తేదీ నాడు ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఉత్పత్తులకు పైగా అమ్మకం జరపడం ద్వారా కోటి రూపాయలకు పైగా ఆదాయం సంఘ సభ్యులకు వచ్చేలా చేయుటకు ప్రణాళిక చేయడమైనది. మిషన్ డైరెక్టర్, మెప్మా వారు వైయస్సార్ కడప జిల్లాకు 13,258 ఉత్పత్తుల పైగా అమ్మకం జరపడం ద్వారా సుమారు 5 లక్షలు రూపాయలకు పైగా ఆదాయం సంఘ సభ్యులకు వచ్చేలా చేయుటకు ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేయడమైనది

## రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్, 02 :** ఫ్రీ హెూల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తో కలిసి ఆర్డీఓలు, మండల తాసిల్దారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ఫ్రీ హెూల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫ్రీ హెూల్డ్ భూములకు సంబంధించి కొత్తగా వస్తున్న అసైన్మెంట్‌పై ఉత్తమ విఆర్ఓలు, సర్వేయర్లు, సంబంధిత సిబ్బందితో జిల్లా, మండల స్థాయిలో వర్క్ షాప్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్ట్స్ లకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా నేషనల్ హైవే, రైల్వేకు సంబంధించి పెండింగ్‌లో భూ సేకరణ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రానున్న రోజుల్లో లింక్ రికార్డులు కంప్యూటరీకరణ చేసే అవకాశం ఉందని అందుకు జిల్లా, మండల స్థాయిలోని అన్ని రికార్డు రూమ్లలో సిసి కెమెరాలు ఉండేలా చూడాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, త్రాగు నీరు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బందికి లేకుండా చూడాలన్నారు. జిల్లాలో నిర్వహించే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ కూడా ఈ-ఆఫీసులోనే జరిగేలా చూడాలన్నారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధికి చేసేందుకు ఇరిగేషన్, ఆర్ అండ్ బీ అధికారులను అనుసంధానం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న స్థల సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మండల తహశీల్దార్లను ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ రాము నాయక్, ఎఓ రవి కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పునర్వ్యవస్థీకరణ హేతుబద్ధంగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ విద్యార్థుల తల్లిదండ్రుల అభీష్టం మేరకు హేతుబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిఈఓ, సమగ్ర శిక్ష ఏపిసి, కళ్యాణదుర్గం నియోజకవర్గం మండల విద్యాశాఖ అధికారులతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీల ఆమోదంతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ, హెడ్మాస్టర్లు, గ్రామస్తులతో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయరాదని, విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సశాస్త్రీయంగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి అవగాహనతో, అప్రమత్తతతో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి ఐదు మండలాల పరిధిలో 16 సమస్యలు ఉండగా, వాటిని జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. జిల్లాలోని పలు చోట్ల పలువురు ప్రిన్సిపల్స్, వార్డెన్ల ప్రవర్తన బాగుండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మహిళలు, పిల్లల పట్ల ప్రవర్తన సరిగా లేకపోతే చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎక్కడ ఎలాంటి సమస్య రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేజీబీవీలలో నెలకు ఒకసారి బాలికల మెడికల్ హెల్త్ చెకప్ చేయాలని, ఇందుకోసం ఎస్ఓపి తయారు చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసి శైలజ, పీఎంయు మెంబర్లు నాగరాజు, మదన్మోహన్, గురు మునికృష్ణ, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని మండలాల ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

## డిఈఐసి కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన




**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 02 :** జిల్లా ప్రభుత్వాసుపత్రి -ఓపి నెం.99లో ఈరోజు ప్రపంచ ఆటిజం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈ.బీ.దేవి హాజరై, ఆటిజం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్బిఎస్కె డిఈఐసి & ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డా. జి. నారాయణస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. అలాగే క్షేత్రస్థాయి జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం మనోవైద్య నిపుణులు డా. విశ్వనాథ్ రెడ్డి మరియు మానసిక వైద్య విభాగం నుండి వచ్చిన డా. రవి నాయక్ ఆటిజం వ్యాధి లక్షణాలు, పిల్లల్లో కనిపించే సమస్యలు, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానాలు గురించి విశదంగా వివరించారు. క్లినికల్ & చైల్డ్ సైకాలజిస్ట్ సుందరరావు సిరిగిరి ఆటిజం ఉన్న పిల్లల మానసిక, సామాజిక అభివృద్ధి కోసం తల్లిదండ్రులు పాటించాల్సిన మార్గదర్శకాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో డిఈఐసిలో అందించే థెరపీ సేవల గురించి ఆటిజమ్ పిల్లల తల్లిదండ్రులు అందరికీ అర్థమయ్యేలా స్కిట్ రూపంలో ప్రదర్శించి థెరపీ విధానాలను కళ్లకు కట్టినట్టుగా చూపించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అలాగే, ఆటిజం కలిగిన పిల్లల అభివృద్ధికి తోడ్పడే విధంగా డిఈఐసి బృందం ఉచితంగా కలర్ బుక్స్, స్కెచ్ పెన్సిల్స్, కలర్ క్రేయాన్స్ పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ఆలంబన జనార్ధన్, సహృదయ సేవా సమితి బాలకృష్ణ ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు మానసిక ధైర్యం కల్పించడంతో పాటు, వారికి అందుబాటులో ఉన్న చికిత్స విధానాలను వివరించడమైనది.

## శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం

### ఆలయ ఈవో వెంకటేశులు, అడ హక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్





**ధర్మవరం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** మే నెలలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల వేడుకల యొక్క ఏర్పాట్లపై ఈ నెల మూడవ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఆలయంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశులు, ఆలయ అడహాక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించుటకే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి ఉభయ దాతలు, సేవా కార్యకర్తలు, భక్తాదులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆసక్తి గల పుర ప్రముఖులు పాల్గొని తమ యొక్క విలువైన సలహాలు సూచనలు తెలియ జేయవలసినదిగా వారు తెలిపారు. బ్రహ్మోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లకు తగిన సన్నాహాలు కూడా ఏర్పాటు చేయుటకు ఈ సమావేశం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిశెట్ ఉచిత శిక్షణ తరగతులు : ప్రిన్సిపాల్ సురేష్ బాబు

**ధర్మవరం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పా లిసెట్ ఉచిత శిక్షణా తరగతులు సజావుగా ప్రారంభం కావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఈనెల 1వ తేదీతో ముగిశాయని, తద్వారా బుధవారం ఉచిత పోలిశెట్ శిక్షణా తరగతులకు వందమంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. అనంతరం ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, గణితం అధ్యాపకులు హరిబాబు, మల్లికార్జున, ప్రదీప్ లు పా లిశెట్ పరీక్షకు సంబంధించిన పలు సూచనలు, పరీక్ష ప్రశ్న పత్రంపై వారు వివరించడం జరిగిందన్నారు. ఈ ఉచిత శిక్షణా తరగతులు ఏప్రిల్ రెండవ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణలో అప్పుడప్పుడు స్లిప్ టెస్ట్ లు నిర్వహించబడునని, చివరి తేదీన మోడల్ టెస్ట్ పేపర్ ను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తద్వారా ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల స్థాయి తెలుస్తుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు పదవ తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కావున ఆసక్తిగల పదవ తరగతి పరీక్షలు రాసిన వారు మా కళాశాలలో రావచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్స్‌తో సమీక్షా...







**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** నగరంలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ సమావేశ భవనంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి అధ్యక్షతన జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వున్న ల్యాబ్ టెక్నీషియన్స్ కు నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డియంహెచ్ఓ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వివిధ జబ్బులతో వచ్చే వ్యాధిగ్రస్తులకు అపరిధిలో చేయగలిగే 63 పరీక్షలులో వారి పరిస్థితిని బట్టి డాక్టర్ సలహా మేరకు నాణ్యమైన పరీక్షలు తప్పని సరిగచేయాలని ఆదేశించారు. మరీముఖ్యంగా వ్యాధిగ్రస్తునికి వ్యాధి నిర్ధారణ జరిగినప్పుడే వ్యాధిని నయం చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్స్ నిర్వహించే రికాడ్స్ ని వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఓబులు, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ కో-కోక్రీడల పోటీల్లో చిత్తూరు క్రీడాకారులకు కాంస్య పథకం

### ప్రశంసించిన కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు/పెన్ పవర్ /ఏప్రిల్ 2 :** మార్చి నెల 21 నుండి 24 వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కోకో పోటీల్లో చిత్తూరు జిల్లాకు చెందిన క్రీడాకారులకు కాశ్య పథకం సాధించారు. పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తెచ్చిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజి. కోట (యాదమరి) ముత్తరపల్లి (కుప్పం) తీర్థం (బైరెడ్డి పల్లి) జడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్లు సుకుమార్. ముత్తు. దేవేంద్ర. తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ నూతన భవన సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్, కలెక్టర్, ఎమ్మెల్యేలు



**(3వ పేజీ తరువాయి)** అన్ని రకాల సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనే అత్యంత అధునాతన వసతులతో.. ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవనాలను ప్రభుత్వ నిధులతో నిర్మించి, ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే భావనతో, ఏదో విధంగా సహాయ సహకారాలు అందించి పేద కుటుంబాలను అభివృద్ధి వైపు నడిపించాలని కోరారు. అలాగే ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో ఎప్పటినుండో పరిష్కారానికి నోచుకోలేని మడూరు కాలువ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేయపడతామని, కానపల్లె గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సమస్యను కూడా శాస్వితంగా పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా.. ఉన్న ఊర్లలోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. విద్యాభివృద్ధికోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, వరదరాజుల రెడ్డిలు మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, మేధావులు, నిపుణులు, ప్రజలు తమ సహకారాలు అందించి ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని పేదరహితం చేయాలని కోరారు. పేదరిక స్థాయిని తగ్గిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి మన పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సుకు దోహదపదాలన్నారు. గ్రామాల్లో అసమానతలు తగ్గించి వనరులను సద్వినియోగం చేసుకొని పేదరికాన్ని నిర్మూలించాలన్నారు. సమాజంలోని ఉన్నత స్థాయి వ్యక్తులు ఎంతో కొంత శక్తి సామర్థ్యాలను అవసరమున్న మేరకు ఇతరులకు అనుసంధానం చేసి.. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందజేయాలని, అర్హతవున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా విధులు నిర్వహించే బాధ్యత.. సచివాలయ సిబ్బందికి, ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్ర సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచులు సంఘం అధ్యక్షులు, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొండ్రెడ్డి శివచంద్రారెడ్డి, తెదేపా నాయకులు ముక్తీయర్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, ప్రొద్దుటూరు డిఎస్పీ భావన, డిఎంహెచ్ఓ డా. నాగరాజు, స్థానిక తహసీల్దార్ గంగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 340సి జాతీయ రహదారి నిర్మాణ పనులను పూర్తి చేస్తాం



**(3వ పేజీ తరువాయి)** ప్రధానంగా ప్రయాణికులకు, ఎగుమతి దిగుమతులకు సంబంధించి మార్కెటింగ్ రవాణా ఏర్పడి జిల్లా అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. రెండవ విడతలో ప్రారంభమయ్యే ఆత్మకూరు నుండి దోర్నాల వరకు చేపట్టే రహదారి పనులకు స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించి సంబంధిత డిపిఆర్ లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందన్నారు. ప్రతిపాదనలు మంజూరు అయ్యేలోగా మొదటి విడత జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి కావాలన్నారు. రహదారి నిర్మాణ పనులకు వేగవంతంగా పూర్తి అయ్యేందుకు భూయజమానులు సహకరించారని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## ఉద్యోగా అవకాశాలు కల్పించాలని యువత ఆందోళన




**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 2 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం శిరసనంబేడు లోని స్టీలు పరిశ్రమలు తమ గ్రామ యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పరిశ్రమ బయట యువత నిరసన వ్యక్తం చేశారు.మా గ్రామంలో ఉన్న స్టీలు పరిశ్రమలో వెలుపల వ్యక్తులకు ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని తమ గ్రామ ప్రజలకు ఎటువంటి ప్రాధాన్యత ఆ పరిశ్రమంలో ఇవ్వడం లేదని వారు వాపోయారు.రికమండేషన్ తో కాకుండా ప్రతిభ ఆధారంగా లోకల్ వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వాలని వారు కోరారు

## నాపై నింద మోపడం సమంజసం కాదు

### కేహెచ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి

**పెన్ పవర్, రాయలసీమ కోఆర్డినేటర్ ధర్మవరం ఏప్రిల్ 2 :** పట్టణంలోని కె హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు ఎస్ వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ పరీక్షల్లో ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య కోఆర్డినేటర్లు నాకు లక్షల రూపాయలు డబ్బులు ఇచ్చినట్లు నిందలు మోపడం సరికాదని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బుధవారం కొంతమంది విద్యార్థుల సంఘం నాయకులు మా కళాశాలకు రావడం జరిగిందని, ఎస్వీ యూనివర్సిటీ కోఆర్డినేటర్లు మా కళాశాల కు లంచం ఇచ్చినట్టు చెప్పడం పద్ధతి కాదని వారు తెలిపారు. మా కళాశాలలో ఏ పరీక్షలు జరిగినా కూడా నియమ నిబంధనలు ప్రకారమే తప్పక జరుగుతుందని వారు స్పష్టం చేశారు. దూరవిద్య పరీక్షలు రాసే విద్యార్థుల వద్ద డీల్ కుదిరినట్లు తెలపడం అవాస్తవాలని తెలిపారు. మా కళాశాలలో డబ్బులు ఇచ్చి పరీక్షలు రాయించడం అనేది జరగదని వారు తెలిపారు. ఇలాంటి వాటికి తాను అవకాశం ఇవ్వనని తెలిపారు.

### ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం

## మహిళాప్రాంగణం (శక్తి సదన్)ను పరిశీలించిన న్యాయమూర్తి







**కర్నూలు పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి బుధవారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్)ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించి రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు జిజిహెచ్ ద్వారా అందించాలి

### వైద్యులందరూ నిర్ణీత సమయంలో తమ విధులకు హాజరుకావాలి

### జిజిహెచ్‌లో రోగులకుపెట్టే భోజన నాణ్యతను స్వయంగా తిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్





**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు అనంతపురం GMC మరియు GGH వైద్యులందరూ నిర్ణీత సమయంలో తమ విధులకు హాజరుకావాలని మరియు పనివేళల్లో అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పేర్కొన్నారు. బుధవారం స్థానిక అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అన్ని విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్యులందరూ తమవృత్తి ధర్మాన్ని విస్మరించరాదన్నారు. అంతేకాక GMC మరియు GGH వైద్యులందరూ నిర్ణీత సమయంలో తమ విధులకు హాజరుకావాలని మరియు పనివేళల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని అన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అకడమిక్ యాక్టివిటీకి పూర్తి బాధ్యత వహిస్తారన్నారు.రోగి సంరక్షణకు సంబంధించి మొత్తం బాధ్యతలను సూపరింటెండెంట్ నిర్వహిస్తారన్నారు. HODలందరూ తమ సహకారాన్ని అడ్మినిస్ట్రేటర్‌కు అందించే విధంగా సమన్వయంతో పనిచేయాలని అందరూ కలిసి ఒక టీం వర్క్‌గా ప్రజల కోసం కోసంపనిచేయాలన్నారు. GMC, GGH మరియు SSH యొక్క అన్ని HODలు తమ తమ విభాగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలన్నారు.GMC ,ప్రిన్సిపల్ మం జూరైన అన్ని PG సీట్లు మరియు సీనియర్ రెసిడెన్స్ పోస్టులను భర్తీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ముందుగా జిల్లా కలెక్టర్ జిజిహెచ్ లో రోగులకు పెడుతున్న ఆహారాన్ని స్వయంగా తిని పరిశీలించారు. అలాగే జననీ శిశు సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, భోజనం తయారీ కాంట్రాక్టర్ వీరికి అందిస్తున్న భోజనం కు సంబంధించిన బియ్యం, కూరగాయలు ఎక్కడినుంచి తెస్తున్నారని, రోగులు భోజనం చేసిన తర్వాత వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారా, ప్రతిరోజు భోజన నాణ్యతను పరిశీలిస్తున్నారా, తదితర వివరాలను డైటీషియన్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. బియ్యం కాంట్రాక్టర్ స్వయంగా పండిస్తున్నారని, కూరగాయలు మార్కెట్ నుండి తీసుకొని వస్తున్నారని,ప్రతి వార్డు నందు డైట్ ఒపీనియన్ చార్ట్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ ఎన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నారని అడిగారు. జూన్ తో రెండు సంవత్సరాలు పూర్తి అవుతుందని వారి కాంట్రాక్ట్ ముగుస్తుందని అధికారులు తెలిపారు. మద్దికేర మండలంకు చెందిన రామాంజనేయులును భోజనం చేశారా.. ఏ విధంగా ఉంది, మీకు వంట చేయడం వచ్చా, మీ ఇంట్లో వండిన భోజనం బాగుందా లేక ఇక్కడ పెట్టుకున్నా భోజనం బాగుందా అని అడిగారు. ఇక్కడే భోజనం బాగుందని చెప్పారు.ఎన్ని రోజుల నుండి ఉన్నారని అడగగా నాలుగు రోజులుగా ఉన్నావని ఏ వంట నచ్చిందని అడిగారు. అటువంటిదేమీ లేదని అన్ని బాగున్నాయని తెలిపారు. మీరు ఉన్న వార్డులో వెళదాం అని ఎం ఎం వార్డ్ లోని వారి కుమారుడైన వెంకటేష్ ను కలిసి ఎలా ఉందని మందులు ఇక్కడ ఇచ్చారా బయట తెచ్చుకున్నారా అని అడిగారు. ఆసుపత్రిలోనే ఇచ్చారని బాగా చూస్తున్నారని సమాధానం ఇచ్చారు. ఎం.ఎం.వార్డులోని మౌలిక సదుపాయాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరిండెంట్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అన్ని విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత లేని చోట పక్షపాత వైఖరి..!




**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ కడప ఏప్రిల్ 2 :** చదివే ముందు... మెల్లగా కళ్లు మూసుకోండి... దీర్ఘంగా శ్వాస తీసుకోండి... ఈ క్షణంలో మీలోని పవిత్రతను అనుభవించండి ఉపాధ్యాయ – విద్యార్థి సంభాషణ – జీవిత పాఠం ఒకసారి, ఒక ప్రొఫెసర్ తన తరగతిలో ఒక కథ చెబుతున్నాడు. ఒకసారి సముద్రం మధ్యలో ఉన్న ఒక ఓడలో పెద్ద ప్రమాదం జరిగింది. ఓడలోని ప్రయాణికులను ఖాళీ చేయించమని కెప్టెన్ ఆదేశించాడు. ఓడలో ఒక యువ జంట ఉంది. (లైఫ్ బోట్) చిన్న పడవలోకి ఎక్కేందుకు వారి వంతు వచ్చినప్పుడు, ఆ పడవలో ఒకరికి మాత్రమే చోటు మిగిలి ఉంది. ఆ సమయంలో ఆ వ్యక్తి తన భార్యను క్యూలో నుంచి తోసేసి తాను పడవలోకి దూకాడు. మునిగిపోతున్న ఓడపై నిలబడి ఉన్న స్త్రీ వెళ్ళిపోతున్న తన భర్తతో ఇలా అరిచింది. ప్రొఫెసర్ ఆగి విద్యార్థులను, "మీరు ఏమనుకుంటున్నారు, ఆ స్త్రీ తన భర్తతో ఏమి చెప్పిఉంటుంది?"అని అడిగాడు. చాలా మంది విద్యార్థులు వెంటనే, "ఆ మహిళ – నేను నిన్ను ద్వేషిస్తున్నాను! ఐ హేట్ యూ! అంది అని, కొంతమంది విద్యార్థులు – " మీరు చేసింది సరైన పని కాదు అంది అని, కొందరు విద్యార్థులు – "మీరు నన్ను మోసం చేసారు", అని ఇలా ... దాదాపు అన్ని సమాధానాలు ఇలాగే ఉన్నాయి. ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, నిశ్శబ్దంగా ఉన్న విద్యార్థి వైపు ప్రొఫెసర్ దృష్టి ఆకర్షించబడింది. ప్రొఫెసర్ అతనిని ఆశగా అడిగాడు, "నువ్వు చెప్పు, భార్య తన భర్తతో ఏమి చెప్పి ఉంటుందని అనుకుంటున్నావు?" ఆ కుర్రాడు – " బిడ్డను జాగ్రత్తగా చూసుకో అని ఆమె చెప్పిఉండాలి అని అనుకుంటున్నాను !" అన్నాడు. ప్రొఫెసర్ ఆశ్చర్యపోయాడు, ఆ అబ్బాయిని అడిగాడు – "నీవు ఈ కథ ఇంతకు ముందు విన్నావా?" దానికి ఆ కుర్రాడు – "లేదు. కానీ, మా అమ్మ అనారోగ్యంతో చనిపోతున్నప్పుడు మా నాన్నకి ఇదే చెప్పింది ." ప్రొఫెసర్ విచారంగా నవ్వుతూ – "నీ సమాధానం సరైనదే!" అన్నాడు.ప్రొఫెసర్ కథను కొనసాగించాడు – ఓడ మునిగిపోయింది, స్త్రీ మరణించింది, భర్త ఒడ్డుకు చేరుకున్నాడు. ఓడ మునిగిపోయినప్పుడు, తన ఏకైక కుమార్తె అమ్మమ్మ వద్ద ఉంది. అతను తన జీవితమంతా ఆమెను పెంచడానికే గడిపాడు. చాలా సంవత్సరాలకి, ఆ వ్యక్తి చనిపోయినతర్వాత, ఒక రోజు ఇల్లు శుభ్రం చేస్తూండగా, కుమార్తెకు తన తండ్రి డైరీ దొరికింది. తన తల్లితండ్రులు ఆ ఓడలో ప్రయాణిస్తున్న సమయంలో, తన తల్లి ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ ఉందని, ఆమె జీవితానికి కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉన్నట్లుగా డైరీ ద్వారా తెలుసుకుంది. అలాంటి క్లిష్టమైన సందర్భంలో, ఆమె తండ్రి ఒంటరిగా లైఫ్ బోట్ లోకి ఎక్కే ఆ కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు. తండ్రి డైరీలో ఇలా రాసుకున్నాడు "నువ్వు లేని నా జీవితానికి అర్థం లేదు, నేను నీతోపాటుగా సముద్రంలో కలసిపోవాలని అనుకున్నాను. కానీ మన ప్రియమైన బిడ్డ గురించి ఆలోచించినప్పుడు, నేను నిన్ను ఒంటరిగా వదిలివేయవలసి వచ్చింది." ప్రొఫెసర్ కథ ముగించేసరికి క్లాస్ అంతా నిశ్శబ్దంగా అయిపోయింది. ఈ ప్రపంచంలో చాలా సరైనవి, సరికాని విషయాలు ఉన్నాయి, అనేక సంక్లిష్టతలు ఉన్నాయి, వాటిని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అందుకే లోతు తెలియకుండా ప్రతీ పరిస్థితినీ, కేవలం పైపై నుండి చూసి ఖచ్చితంగా అంచనా వేయలేరు. ఒక విభేద విషయంలో మొదట క్షమాపణ చెప్పినవాడు తప్పు చేసినవాడయ్యి ఉండాల్సిన అవసరం లేదు. బహుశా అతను స్నేహసంబంధాన్ని కొనసాగించడం మరింత ముఖ్యమైనదిగా భావించి ఉండవచ్చు. స్నేహితులతో కలిసి పార్టీలు చేసుకుంటున్నప్పుడు, బిల్లు చెల్లించే స్నేహితుడి జేబు నిండా నోట్లకట్టలు ఉండకపోవచ్చు. అతనికి, స్నేహం ముందు డబ్బు తక్కువగా అనిపించవచ్చు, తన స్నేహితుల పట్ల అతను విశాల హృదయాన్ని కలిగి ఉండవచ్చు. మీకు సహాయం చేసే వారు మీ అనుగ్రహభారానికి వంగి చేయాల్సిన అవసరం లేదు. దయ, కరుణ వారి హృదయాలలో ఉంటాయి కాబట్టి వారు మీకు సహాయం చేస్తారు. మనం మనుషులను హృదయపూర్వకంగా అర్థం చేసుకోవడం మానేసి, వారిని పైపైన చూసి విమర్శించడం వల్ల నేటి జీవితం కష్టంతరంగా మారింది. కాస్త అర్థం చేసుకుని, కాస్త మానవత్వం చూపితే, అదే మనకు సరైన దారి చూపిస్తుంది. మిత్రులారా, జీవితంలో చాలా సార్లు మనం తప్పు ఒప్పుల మధ్య ఎంచుకోలేకపోవచ్చు. ఆ సమయంలో మనం మన హృదయంతో అనుసంధానం అవ్వాలి, ఆపై సరైన ఎంపిక చేసుకోవాలి. ఎందుకంటే కళ్లకు కనిపించేవి, చెవులకు వినిపించేవన్నీ నిజం కావు, కానీ హృదయం చెప్పేది ఎప్పుడూ సరైనదే. వినమ్రత, స్వచ్ఛత కీలకమైనవి. స్వచ్ఛత హృదయ నిష్కాపట్యతను తెస్తుంది. నిష్కాపట్యత అందరితో అనుకూలమైన అన్యోన్యతను సృష్టిస్తుంది. స్వచ్ఛత లేకుండా ఐక్యత ఉండదు, ఐక్యత లేని చోట ఎల్లప్పుడూ పక్షపాత వైఖరి ఉంటుంది.

## బియ్యం గోడౌన్ పరిశీలించిన తాసిల్దార్ రమేష్ బాబు



**పూతలపట్టు/పెన్ పవర్/ఏప్రిల్ 2 :** పూతలపట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ బియ్యం గోడౌన్ ని బుధవారం తాసిల్దార్ రమేష్ బాబు పరిశీలించారు.పూతలపట్టు గోడౌన్ నుండి పెనుమూరు. ఐరాల.పూతలపట్టు మండలాలకు ఇక్కడ నుండే రేషన్ సరుకులు సరఫరా చేస్తారు.బియ్యం కార్డుకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని నిత్యవసర వస్తువుల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వపాఠశాలలకుఅందించే రాగి పిండి.బెల్లం.అంగన్వాడి కేంద్రాలకు అందించే కందిపప్పు నిత్యఅవసరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోడౌన్ అధికారి పూజిత తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



**పలమనేరు పెన్ పవర్ ఏప్రిల్ 02 :** బైరెడ్డిపల్లె మండలంలోని చప్పడిపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్గొన్న సాంస్కృతి కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. అనంతరం ఉపాధ్యాయులు పిల్లలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రభుత్వ బడులలో ప్రవేట్ బడులకంటే మంచి అద్భుతమైన మౌలిక సౌకర్యాలు ఉన్నాయని, ఆటపాటలతో కూడిన గుణాత్మక విద్య కేవలం ఇక్కడ మాత్రమే అందుతుందని ఉపాధ్యాయులు అన్నారు. కావున అందరూ కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

## జిల్లాకే వన్నె.. గానుగపెంట!!

### సభలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు



**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** ప్రముఖ సాహితీవేత్త, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్, డాక్టర్ ,గానుగపెంట హనుమంతరావు వైయస్సార్ కడప జిల్లాకే వన్నె తెచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు ప్రశంసించారు. బుధవారం క డప కలెక్టరేట్ లోని డిఆర్వో కార్యాలయంలో, విశ్వావసు నామ ఉగాది రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాన్ని హనుమంతరావు అందుకున్న సందర్భంగా, ఆయనను సత్కరించి, అభినందించారు. డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, హనుమంతరావు ఉత్తమ ఉపాధ్యాయునిగా, రచయితగా, పాత్రికేయునిగా, కవయిత్రి మొల్ల సాహితీ సేవా దురంధరునిగా, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులుగా వివిధ కోణాలలో సేవలు చేసి, గతంలో రాష్ట్రపతిచే, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారిచే సత్కారం పొందడం జిల్లాకే గర్వకారణం అన్నారు. హనుమంతరావు మాట్లాడుతూ, నా నిరంతర తపన నన్ను ఈ స్థాయికి చేర్చిందనీ, రక్తబంధువుల కంటే ,సాహితీ బంధువులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎక్కువ మందిని పొందానన్నారు. వారి ఆశీస్సులే నాకు శ్రీరామరక్ష అని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో బీసీ సంఘ అధ్యక్ష కార్యదర్శులు లింగమూర్తి, గోవింద నాగరాజు, కార్యవర్గ సభ్యుడు అంజి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్ ,రామ్మూర్తి నాయుడు, కోశాధికారి నూనె నాగేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి, ఉపాధ్యక్షులు పెండ్లిమర్రి మల్లయ్య, రాధాకృష్ణ, మొల్ల సాహిత్య పీఠం మహిళా విభాగం కార్యదర్శి కొండూరు స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. హనుమంతరావును, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు పూలమాల, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు.

## బెల్ట్ షాపులపై చర్యలు కోసం సిపిఐ నాయకులవినతి



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 2 :** నియోజకవర్గంలో విచ్చలవిడిగా ప్రతి పల్లె లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిపిఐ నియోజకవర్గ పార్టీ ఆధ్వ ర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్సు ఉన్నటువంటి బ్రాందీ షాపుల నుండి విచ్చలవిడిగా ప్రతి పల్లెకు మద్యం యదేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్ట్ షాపులు నిర్వహిస్తే లైసెన్స్ లు రద్దు చేస్తామని, బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామన్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలను కూడా పెడచెవి న పెట్టి శ్రీకాళహస్తి నియోజకవర్గం అధికారంలో ఉన్న కొంతమంది రాజకీయ నాయకులు ఒలిళ్లతో పచ్చని పల్లెటూర్లలో చిచ్చులు రేపుతో పేద మధ్యతరగతి ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నటువంటి బ్రాందీ షాపుల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి లైసెన్సులను రద్దు చేయాలని, బెల్ట్ షాపుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఎక్సైజ్ జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి శ్రీడాభస్తి నియోజకవర్గం లో బెల్ట్ షాపులు లేకుండా కల్తీ మద్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు మించల శివకుమార్, శ్రీనివాసులు, ప్రజానాట్య మండల నాయకులు చారుశీల, గురవయ్య ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభం సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభం




**తిరుపతి/పెన్ పవర్/ ఏప్రిల్ 02 :** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభం సంప్రోక్షణ కార్యక్రమాలు బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 8 నుండి 11.15 గంటల వరకు యాగశాలలో వాస్తుహోమం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు కళాపకర్షణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆలయ అర్చకులు శ్రీ సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఏప్రిల్ 3న ఉదయం 8.15 నుండి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభ మహా శాంతి అభిషేకం, పూర్ణాహూతి జరుగనుంది. ఏప్రిల్ 4న ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు మహా పూర్ణాహూతి, కుంభ ప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

## నందవరం చౌడేశ్వరి దేవి ఆలయంలో.. మంత్రి సత్య కుమార్ యాదవ్..



**నందవరం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** మంత్రి సత్య కుమార్ యాదవ్ నందవరంలో జరిగిన శ్రీ చౌడేశ్వరి దేవి మహోత్సవానికి హాజరయ్యారు. ఈ మహోత్సవం ఘనమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకగా నిర్వహించబడింది. ఈ ఉత్సవం ప్రాంతీయ సంప్రదాయాలను, భక్తిని ప్రతిబింబిస్తూ భక్తులను, సాంస్కృతిక అభిమానులను ఒకచోట చేర్చింది. మంత్రి మొదటి దర్శన భాగ్యం పొందారు, అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి ఆరోగ్యం, సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. వారి జీవితాల్లో ఐశ్వర్యం, ఆనందం కలగాలని దైవ కృపను కోరుకున్నారు.

### ఫ్రీ హోల్డ్ రెండవ విడత రీసర్వే పనులను

## త్వరితగతిన పూర్తి చేయాలి

**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి బుధవారం రెవెన్యూ సదస్సుల పిజిఆర్ఎస్, రీసర్వే, ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు సీసీఎల్ఏ నక్కల ప్రభాకర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు సీసీఎల్ఏ నక్కల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో రీసర్వేకి సంబంధించి మొబైల్ యాప్ ను ఆర్ఎస్ డీటీలు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు, లాగిన్ అయి ఈ సర్వే కి సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసేవిధంగా చూడాలని, తద్వారా ఈ సర్వే చేపడుతున్న పనులను, వాటి స్థితిగతులను తెలుసుకొనుటకు సులభతరంగా ఉంటుందన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేయాలన్నారు. రెండో విడత రీసర్వేకు సంబంధించి గ్రామసభల ద్వారా ఎంపిక చేసి పూర్తిగా మండలానికి రెండు గ్రామాలను ఎంపిక చేసిన వెంటనే రీ సర్వే పనులు ప్రారంభించాలన్నారు. అలాగే జిల్లాలోని ముగ్గురు బెస్ట్ తాసిల్దార్లు, డీటీలు, ఆర్ ఐలు, వీఆర్వోలను గుర్తించి వారితో సమావేశాలను ఏర్పాటు వారికి ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వారికి ఈ పనులను అప్పగించే విధంగా చూడాలని డిఆర్ఓను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, సర్వే ఏడి రూప్ల నాయక్, పిజిఆర్ఎస్ తహసిల్దార్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి నితిన్ ఘట్కరిని కలిసిన సాయి లోకేష్ & ముక్కా రూపానందరెడ్డి





**అన్నమయ్య జిల్లా, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** భారత కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ ఘట్కరితో అన్నమయ్య జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు సాయి లోకేష్ అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మరియు ఉమ్మడి కడప జిల్లా (కూడ) చేర్మెన్ ముక్కా రూపానందరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ పార్టీ అధ్యక్షులు పురందేశ్వరి నేడు బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కడప నుంచి రేణిగుంటకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిని ఉందని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వెనువెంటనే ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా కడప– రేణిగుంటకు నాలుగు లైన్ల రహదారి మంజూరే ఉందని అయితే వాహనాల రద్దీ దృశ్య దానిని వెంటనే ఆరు లైన్లకు మార్చి ఆరు లైన్ల రోడ్ల పనులను చేపట్టాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. కేంద్ర మంత్రి వెంటనే స్పందించి కడప నుండి రేణిగుంటకు ఆరు లైన్లుగా చేస్తామని సానుకూలంగా స్పందించారు.

### నూతన కడప జిల్లా బిజెపి అధ్యక్షులు

## జంగిటి వెంకటసుబ్బారెడ్డికి శుభాకాంక్షలు

### సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి.. విశ్వహిందూ పరిషత్



**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** కడప జిల్లా బిజెపి నూతన అధ్యక్షులుగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్, జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జంగిటి వెంకటసుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి రాయలసీమ కోఆర్డినేటర్ పెన్ పవర్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ రీజనల్ కోఆర్డినేటర్ నూతనంగా ఎన్నికైన వెంకట సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో అనేక వేలమంది మహిళలు రైతులు పెద్ద సంఖ్యలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రజలు మనల్ని నమ్మి ఓట్లు వేశారు..

## వారి సమస్యలపై దృష్టి పెట్టండి : పరిటాల శ్రీరామ్



**ధర్మవరం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు మనపై ఇంకా ఎక్కువ బాధ్యత ఉంటుంది. పార్టీ శ్రేణులకు పరిటాల శ్రీరామ్ దిశా నిర్దేశం. ధర్మవరంలో ప్రజా దర్బార్ కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కార వేదిక రూ.7.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్, ప్రజలు మా కంటే ఎక్కువగా స్థానిక నాయకులైన మిమ్మల్ని నమ్మి ఓట్లు వేశారని.. వారి సమస్యలు తీర్చే బాధ్యత కూడా మనపై ఉంటుందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. ధర్మవరం టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్–కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ తో పాటు హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యల గురించి శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటినీ కచ్చితంగా పరిష్కరించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 9నెలలు గడిచిందని... ఇక నుంచి మనం క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికంటే అధికారంలో ఉన్నప్పుడే మనపై బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లు వేశారని... ఏదైనా సమస్య వస్తే పరిష్కరిస్తారనే నమ్మకం వారికి ఉంటుందని... ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మనం పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. పార్టీలో పదవులు ఇతర పనులు జరగడం లేదన్న ఆవేదన కొంతమందికి ఉందన్నారు. అయితే అధికార పార్టీలో ఉన్నప్పుడు మనకు కొన్ని పరిమితులు ఉంటాయని కార్యకర్తలు వాటిని అర్థం చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని.. ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో ఎక్కువమందికి పదవులు వస్తే... అది ప్రజలకు మంచి చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఇకనుంచి ప్రతి ఒక్కరు తమ వార్డు, గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. వారి సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని పరిటాల శ్రీరామ్ దిశా నిర్దేశం చేశారు. 12మందికి రూ.7.68 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ కింద సాయం అడిగిన వెంటనే స్పందిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వం ఇది అని శ్రీరామ్ అన్నారు.



### "అనంత ఆణిముత్యాలు" కింద

## ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు సహాయం

### – జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 02 :** "అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ కింద ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో "అనంత ఆణిముత్యాలు" ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంత ఆణిముత్యాలు కింద జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు ఎంతవరకు మేలు చేయగలుగుతామో అంత మేలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎవరైనా సామాజిక ఆర్థికంగా వెనుకబడి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థులను గుర్తించి కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. నిజమైన అర్హత ఉన్న పిల్లలు ఎవరు అనేది క్షేత్రస్థాయిలో గుర్తించాలని, ఎస్టీ, ఎస్సీ, బీసీ, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఫోక్సో కేసుల బాధితుల కుటుంబాలకు అందించేలా చూడాలన్నారు. ఆర్థిక సహాయం కోసం ఒక దరఖాస్తు వచ్చినప్పుడు సంబంధిత జిల్లా అధికారులు, మండల తహసిల్దార్, ఆర్డీవోల నివేదికలు ఖచ్చితంగా ఉండాలన్నారు. దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని, ప్రభుత్వ పథకాల కింద లబ్ధిపొందిన వారిని అనర్హులుగా గుర్తించాలన్నారు. నిజాయితీగా అర్హులను గుర్తించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా, జాయింట్ కలెక్టర్ ఉపాధ్యక్షులుగా, డిఆర్వో జనరల్ సెక్రెటరీగా, డిఆర్డిఏ పిడి జాయింట్ సెక్రటరీగా, కలెక్టరేట్ ఏవో ట్రెజరర్ గా, డీఈవో, బీసీ వెల్ఫేర్ డిడి, డిటిడబ్ల్యూఓ, సోషల్ వెల్ఫేర్ డిడి, ఎల్డిఎం ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అనంత ఆణిముత్యాలు ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్మెంట్ సొసైటీని 2008వ సంవత్సరంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సొసైటీ కింద ఐదుగురు ఆర్థిక సహాయం కింద దరఖాస్తు చేసుకోగా, వారికి తగిన ఆర్థిక సహాయాన్ని చెల్లించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసి శైలజ, డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, సోషల్ వెల్ఫేర్ జెడి రాధిక, బిసి సంక్షేమ శాఖ డిడి ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, బి సెక్షన్ డిటి కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మిర్చి రైతులకు న్యాయం చేయాలి.. మద్దతు ధర పెంచండి

### పార్లమెంటులో వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి



**తిరుపతి/ పెన్ పవర్/ ఏప్రిల్02 :** గుంటూరు మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, ముఖ్యంగా దిగుబడులు తగ్గిపోవడం, సాగు వ్యయాలు పెరగడం, మార్కెట్ ధరలు భారీగా పడిపోవడం వంటి సమస్యలు రైతుల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వైసీపీ తిరుపతి ఎంపి గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రత్యేక ప్రస్తావన 377 ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరు జిల్లా ప్రపంచ ప్రఖ్యాత మిరప రకాలైన తేజ, బ్యాడ్గి, డిడి బెస్ట్ వంటి మిరప ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిందన్నారు. అయితే, ప్రస్తుతం మిరప రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. మిర్చి సాగుకి పెట్టుబడులు భారీగా పెరిగి ఎకరానికి రూ.2.5 లక్షలకు చేరుకున్నాయని తెలిపారు. కాగా గతేడాది క్వింటాల్‌కు రూ.22 వేలు ఉన్న మిర్చి ధర ఇప్పుడు రూ.10 వేల కంటే తకువకు పడిపోయిందని ఆవేధన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతు లేకపోవడంతో రైతులు ఎకరానికి రూ.50 నుంచి 60 వేల వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గుంటూరు మిర్చి యార్డు, సత్తెనపల్లి రోడ్డులో పెద్ద సంఖ్యలో రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సరైన మద్దతు ధర దక్కకుండా ధరలు పతనమయ్యేలా దళారీలు రాష్ట్ర ప్రభుత్వంతో చేతులు కలిపినట్లు ఆరోపణలు ఉన్న విషయాన్ని సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇన్టర్వెన్షన్ స్కీమ్ ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ నిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతుల చేతికి చేరని విషయాన్ని ఎత్తి చూపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన సమయంలో, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం బదులుగా ప్రతిపక్షంపై విమర్శలు చేయడానికే పరిమితం అవుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి మిర్చి క్వింటాల్‌కు రూ.18 వేల చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు తీఉకోవాలని, రైతులకు న్యాయం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిని కోరారు. మిర్చి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రెవెన్యూ సమస్యలను నాణ్యతగా పరిష్కారం చేయాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 02 :** రెవెన్యూ సమస్యలను నాణ్యతగా పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ సెక్టార్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటర్ ట్యాక్స్ కు సంబంధించి 12.25 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 10 వేల రూపాయలు మాత్రమే వసూలు చేశారని, వాటర్ ట్యాక్స్ వసూలును వెంటనే మొదలుపెట్టి వేగంగా చేపట్టాలన్నారు. రీసర్వే ప్రక్రియ మొదటి దశకు సంబంధించి డిఎల్ఆర్‌లో పురోగతి తీసుకురావాలని, గ్రౌండ్ టు థింగ్ వేగవంతం చేయాలన్నారు. సర్వే స్టోన్స్ క్లియరెన్స్ చేసేలా చూడాలని, ఇందుకు సంబంధించి గతవారం 14,546 స్టోన్స్ క్లియర్ చేయగా, జిల్లాలో ఇంకా 48 వేలకు పైగా పెండింగ్ ఉందని, రోజుకు 5 వేల స్టోన్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. వెబ్లైజేషన్‌కు సంబంధించి పెండింగ్ నాలుగు రోజుల్లోపు మొత్తం పూర్తి చేయాలన్నారు. రీసర్వే ప్రక్రియ రెండవ దశకు సంబంధించిన నివేదికలు అందజేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన పిజిఆర్ఎస్ సమస్యలను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏలోపు వెళ్లకుండా గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. మూడవ కలెక్టర్ల సమావేశంలో రెవెన్యూ సమస్యలు బాగా పరిష్కారం అవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. 22ఏ, డాటెడ్ ల్యాండ్, భూమి అప్పగింత, అసైన్ మెంట్ ల్యాండ్, ఇనామ్స్ & ఎస్టేట్స్, ఆర్ఓఆర్ వెబ్ల్యాండ్ సమస్యలు, రీసర్వే సమస్యలు, సిటిజన్స్ సర్వీసెస్, పిజిఆర్ఎస్ పరిష్కారంపై దృష్టి పెట్టడం అత్యంత ముఖ్యమైనదని, ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## టీటీడీపై సమీక్ష చేసిన సీఎం చంద్రబాబు



**తిరుపతి/ పెన్ పవర్/ ఏప్రిల్ 02 :** తిరుమల తిరుపతి దేవస్థానంపై సీఎం చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ ప్రజెంటేషన్ ఇచ్చింది. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై టీటీడీ పెద్దలతో సీఎం సమీక్ష జరిపారు. టీటీడీ దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు.. సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి అభిప్రాయాలపైనా చర్చకు వచ్చింది. ఈ సమావేశానికి దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు హాజరయ్యారు.

## మహాత్మా గాంధీ గ్లోబల్ శాంతి అవార్డు డాక్టర్ ఎం విజయపాల్ రెడ్డి




**అనంతపురం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 2 :** అనంతపురంలో వంశీ హాస్పిటల్నందు కరోనా కాలంలో ఉమ్మడి జిల్లాలో వుండే కరోనా తో బాధపడుచున్న వారికీ తమ దైన సేవ చేయడంలో సమాజానికి మంచి సేవకు గాను ఉన్న ప్రముఖ యమ్. జి.జి.పి. ఇండియా ఫౌండేషన్ వారుఅనంతపురం ప్రముఖ హాస్పిటల్ వంశీ హాస్పిటల్ విధులు నిర్వహించున్న ప్రముఖ డాక్టర్. విజయ్ పాల్ రెడ్డికి ఈ అవార్డు ప్రకటించడం జరిగింది.అత్యవసర వైద్యశాస్త్ర నిపుణుడు డా. విజయ్ పాల్ రెడ్డి సమాజంకి మరియు కోవిడ్ సమయంలో చేసిన విశిష్ట సేవలకు గాను యమ్. జి. జి. పి ఇండియా ఫౌండేషన్ వారు మహాత్మ గాంధీ గ్లోబల్ శాంతి అవార్డు ఇచ్చి సత్కరించారు. ఆయన 150 సార్లు ఉచిత మెడికల్ క్యాంపులుబీ 42 సార్లు రక్త దానంబీ చనిపోయిన రైతు కుటుంబాలకి, చదువుతున్న విద్యార్థులకి మరియు డబ్బులేకుండ ఇబ్బంది పడుతున్న రోగులకు ఆర్థిక సహాయంబీ కోవిడ్ లాక్ డౌన్ సమయంలో అవసరం ఉన్న ప్రజలకు ఆర్థిక మరియు ఇంటి సరుకులు సహాయం చేయడం జరిగింది. ఈ విశిష్ట సేవలకు గాను డా.విజయ్ పాల్ రెడ్డికి ఈ అవార్డు రావడం పట్ల ఆయన కుటుంబ, బంధు, మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 2 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం. పెళ్ళకూరులోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరీ శంకర్ ప్రారంభించి మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెలా సుమారు 4 ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 40 మండలాల్లో 35000 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

## శ్రీకాళహస్తి వేడుకలకు కోలా ఆనంద్ పిలుపు



**శ్రీకాళహస్తి , పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 2 :** బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఏప్రిల్ 6న నిర్వహించడానికి సన్నద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. బుధవారం శ్రీకాళహస్తిలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

### శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 2 :** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి బుధవారం పెనుగొండ క్షేత్ర పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శన అనంతరం దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు లోకేశ్ రెడ్డి, రవి, హరి యాదవ్ పాల్గొన్నారు.

# అప్పలరాజును వెంటాడుతున్న కేసులు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
శ్రీకాకుళం జిల్లాలో రాజకీయం అంతా ఇప్పుడు సీదిరి అప్పలరాజు చుట్టూనే నడుస్తోంది. ఒకప్పుడు మంత్రిగా ఉన్న ఆయన ఇప్పుడు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ సీదిరి అప్పలరాజును పోలీస్ కేసులు వెంటాడుతున్నాయి. తాజాగా ఆయనపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఢిల్లీరావు అనే వ్యక్తి అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతుందంటూ శుక్రవారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేసినందుకుగాను కేసు నమోదు చేశారు పోలీసులు. విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో పాటు మరో 16 మందిపై కేసు నమోదు చేశారు.రాష్ట్రంలో ఎప్పుడూ పొలిటికల్ హీట్ తో రగిలిపోయే నియోజకవర్గాలలో పలాస నియోజకవర్గం ఒకటి. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్న నిత్యం ఏదో ఒక అంశంపై రచ్చ జరుగుతూ వార్తలలో ఉంటుంది ఈ నియోజకవర్గం. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పక్కన పెడితే ఇక్కడి నేతలను పోలీసు కేసులు వెంటాడుతూ ఉంటాయి. ప్రతిపక్ష వైసీపీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు కేసులు నమోదయ్యాయి. వీటికి తోడు ఇప్పుడు తాజాగా మరో కేసు నమోదు కావడంతో కేసుల సంఖ్య నాలుగుకి చేరింది. తాజాగా పోలీసుల విధులకు ఆటంకం కల్పించారంటూ శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.పలాస మండలం నీలావతికి చెందిన ఢిల్లిరావు అనే పౌర హక్కుల సంఘం నేత అనుమానాస్పద మృతి కేసు విషయమై శుక్రవారం(మార్చి 28) మృతిని భార్య కమల, గ్రామ పెద్దలతో కలిసి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఢిల్లీ రావు మృతికి కారణం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 3 నెలలు గడిచినా ఇప్పటికీ పోలీసులు మృతికి కారణం ఏంటనేది చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, మాజీ మంత్రికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దర్యాప్తు వేగవంతం చేసి నెల రోజుల్లో ఢిల్లి రావు మృతికి కారణం ఏంటనేది స్పష్టం చేస్తామని చివరకు పలాస ఆూఖ వెంకట అప్పారావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు అప్పలరాజు.అయితే అదే రోజు అదే పోలీస్ స్టేషన్ లో ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ జరగాల్సి ఉంది. కాసేపటిలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కి ూఖ చేరుకుంటారనగా మాజీ మంత్రి అప్పలరాజు నిరసనకు దిగారు. దీంతో గుంపుగా ధర్నా చేపట్టి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో సహా మరో 16 మంది పైన పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ అభియోగాలపై జిల్లాలో మూడు కేసులు నమోదు కాగా తాజాగా ఇపుడు ఆయనపై మరో కేసు నమోదయింది.తనపై పోలీసులు తాజాగా మరో కేసు నమోదు చేయటంపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఘాటుగానే స్పందించారు. మేము ధర్నా చేసామని మాపై ఈఎఖీ నమోదు చేస్తే.. ఢిల్లీ రావు మృతి



చెంది మూడు నెలలైన కనీస వివరాలు వెల్లడించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులను ఏం చెయ్యాలని ప్రశ్నించారు. ఇది మీ రోజు.. తైతక్కలు ఆడండి మేం భరిస్తాం. కానీ మా రోజు వచ్చినపుడు మాత్రం ఇంతకన్నా గట్టిగా మీ చేత తైతక్కలాడిస్తాం అని మంత్రి పోలీసులను హెచ్చరించారు. ఈ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో తనపై నాలుగు కేసులు పెట్టారని, రానున్న నాలుగేళ్లలో ఇంకా తనపై ఎన్ని ఈఎఖీ లు వేయాల్సి వస్తాదో అని అన్నారు.తెప్పల ఢిల్లీరావు అనే ఉద్ధానం వాసి మృతి కేసులో నిజనిజాలు వెల్లడించండని అనేకసార్లు డిఎస్పీకి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. పోలీసులు రెండు రోజుల్లో, వారం రోజుల్లో చెబుతామని చెప్పి ఎంతకీ తేల్చకపోతే తాము వెళ్లి స్టేషన్ ముందు ధర్నా చేశామని చెప్పారు. ప్రశ్నించే వారిపై ఈఎఖీ లు వేస్తామంటే అదేం పరిపాలన అని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఖచ్చితంగా గట్టిగా సమాధానం చెప్పే రోజు వస్తాదని అన్నారు. మరోవైపు, మాజీ మంత్రి అప్పలరాజు తోపాటు మరో 16 మందిపైన పోలీసులు కేసు నమోదు చేయటంపై మృతుడు ఢిల్లిరావు భార్య తెప్పల కమల సైతం స్పందించారు. 50 ఏళ్లకే నా భర్తను దారుణంగా చంపేశారని, దానిపై పోలీసుల నుండి సరైన రెస్పాన్స్ లేకపోతే ఎస్పీకి వినతి పత్రం ఇచ్చేందుకు గ్రామ పెద్దలు, మిగతా సర్పంచులతో కలిసి వెళ్ళానని కమల చెప్పారు. తనకు న్యాయం చేయండి అని ఎస్పీ కలిసి అడగడానికే తాము వెళ్ళామని చెప్పారు. తన భర్త చనిపోయాక 3నెలలుగా తాను, తన కొడుకు దిక్కులేని వారీగా ఉంటున్నామనిఆమె అవేదన వ్యక్తం చేశారు. ఇలా మాపై కేసులు పెట్టీ ఈరోజో రేపో మమ్మల్ని కూడా చంపేసేటట్టు ఉన్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఇదిలావుంటే, మరో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు పంపారు. క్వార్ట్జ్ అక్రమంగా తరలించారా? లేదా? సోమిరెడ్డి ఆరోపణల్లో నిజమెంత? స్టేషన్‌కు వచ్చి సమాధానం ఇవ్వండి అంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు పోలీసులు. నెల్లూరు జిల్లా తాటిపర్తిలో రుస్తుం మైన్స్ కేసులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసు ఇచ్చిన పోలీసులు.. విచారణకు రావాలంటూ సూచించారు. నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు కాకాని ఇంటికి వెళ్లిన సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటి గేటుకు నోటీసులు అంటించారు.రుస్తుం మైన్స్ కేసులో ఇప్పటికే ఏడుగురిపై ఈఎఖీ నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో కాకాని పేరును ం4గా చేర్చారు. పోదలకూరు మండలం తాటిపర్తి రుస్తుం మైన్స్‌లో అక్రమంగా వైట్ క్వార్ట్జ్ తరలించారంటూ 2024లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో పాటు క్వారీ వద్ద నిరసన చేపట్టారు. ఆ కేసుకు సంబంధించి ప్రస్తుతం విచారణ చేస్తున్న పోలీసులు.. కాకాని గోవర్ధన్ రెడ్డిని విచారణకు పిలిచారు. ఈ కేసులో కాకాని ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. తనపై తప్పుడు కేసు పెట్టారని ఇప్పటికే ఆరోపించిన కాకాని ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో కాకాని అందుబాటులో లేరు. మరి పోలీసుల నోటీసులపై ఏ విధంగా స్పందిస్తారు? విచారణకు హాజరు అవుతారా లేదా ఉన్న ఉత్కంఠ నెలకొంది.

# జనసేనలో పెరుగుతున్న ఆశవాహులు



**విశాఖపట్టణం, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
జనసేన కూటమిలో మిత్రపక్షంగా ఉండి అధికారంలోకి వచ్చింది. పవన్ కల్యాణ్ తో పాటు ముగ్గురు మంత్రులు అయ్యారు. ఇద్దరికి ఎమ్మెల్సీ పదవి దక్కింది. అయితే మరో ఇద్దరు కీలక నేతలు వెయిటింగ్ లో ఉన్నారు. జనసేన పార్టీ లో కీలకంగా ఉన్న బొలిశెట్టి సత్యనారాయణతో పాటు శివశంకర్ లు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికలలోనూ వారికి ఎక్కాడ ఎమ్మెల్యే సీట్లు దక్కలేదు. అయితే అధికారంలోకి రావడంతో తమకు కీలకమైన నామినేటెడ్ పదవులు కానీ, ఎమ్మెల్సీ పదవులు కానీ వస్తాయని ఆశించారు. కానీ ఇద్దరు నేతలకు మాత్రం పది నెలల నుంచి పవన్ కల్యాణ్ నిర్ణయాలు నిరాశపరుస్తున్నాయనే చెప్పాలి. ఎందుకంటే వారిద్దరూ ఉత్తరాంధ్రలో పార్టీకి అండగా నిలిచిన వారిలో ముఖ్యులు కానీ ఇప్పటి వరకూ వారికి ఏ పదవి దక్కలేదు. అనేక నెలలుగా ఎదురు చూస్తున్న వారికి ప్రతి సారీ నిరాశ ఎదురవుతుంది. అసలు పవన్ కల్యాణ్ దృష్టిలో వీరున్నారా? లేదా? అన్నది కూడా అనుమానంగానే ఉంది. ఎందుకంటే సామాజికవర్గం తేడా కొడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే అన్ని పదవులు ఒకే సామాజికవర్గానికి చెందిన వారికి ఇవ్వడంపై కూడా ఇతర సామాజికవర్గాల వారు కొంత ఇబ్బంది పడే అవకాశముందన్న అంచనాలు వీరి పదవుల ఆశలపై నీళ్లు కుమ్మరిస్తున్నాయి. పవన్ కల్యాణ్ తమకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించినా సామాజికవర్గం అడ్డుగా వస్తుందేమోనన్న ఆందోళన వారిలో నెలకొంది. త్వరలో ఏ పోస్టు ఖాళీ అయినా వీరికి అవకాశం వస్తుందా? రాదా? అన్నది అనుమానంగానే ఉంది.శివశంకర్ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ 2018లో స్వచ్ఛంద పదవి విరమణ చేసి జనసేన పార్టీలో చేరారు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయన తొలుత హైడ్రో జియాలజిస్ట్ గా పని చేశారు. 1995లో గ్రూప్ 1కు ఎంపికై వాణిజ్య పన్నుల శాఖలో పలు ముఖ్య బాధ్యతలను నిర్వర్తించారు. అంబేద్కర్, పూలే సిద్ధాంతాలతో ప్రభావితమైన శివశంకర్ శ్రీకాకుళంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆలోచన విధానాలకు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 2018లో ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాలుపంచుకొంటూ, పార్టీ అప్పగించిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన అధికార ప్రతినిధిగా ఉన్నారు. కానీ శివశంకర్ కు ఇంత వరకూ పార్టీ పదవి తప్ప ఎలాంటి పదవి దక్కలేదు.మరో కీలక నేత బొలిశెట్టి సత్యనారాయణ. ఈయన విశాఖపట్నానికి చెందిన నేత. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంనుండి 16వ లోక్‌సభకు పోటీ చేయలేకపోయారు. ఆయన 2014 భారత సార్వత్రిక ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా ఓడిపోయారు. ఆయన వృత్తి రీత్యా వ్యాపారవేత్త. తర్వాత జనసేనలో చేరి కీలకంగా మారారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి ఆయనపార్టీలో చేరి ఉత్తరాంధ్రలో పార్టీ బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేశారు. పార్టీ కష్ట సమయంలో ఉన్నప్పుడు జనసేన గొంతుగా మారారు. పవన్ కల్యాణ్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ఆయన సమర్థించుకుంటూ వస్తున్నారు. కానీ గత పది నెలల నుంచి ఆయన పెద్దగా యాక్టివ్ లేకపోవడం గమనార్హం. ఎందుకంటే.. పదవి వస్తుందని ఆశపెట్టుకున్న బొలిశెట్టి సత్యనారాయణ గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో పాటు నామినేటెడ్ పదవి కూడా రాకపోవడంతో ఒకింత అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. అయినా ఆయన తాను జనసేనలోనే కొనసాగుతానని, పవన్ కల్యాణ్ వెంటే నడుస్తునానని చెబుతున్నారు.

# ఎన్నాళ్లీ ఎదురు చూపులు

**నెల్లూరు, ఏప్రిల్ 2, పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటి పోతుంది. త్వరలో ఏడాది పాలన పూర్తి కావస్తుంది. అయినా ఇప్పటి వరకూ నామినేటెడ్ పోస్టుల భర్తీ కొంత వరకే జరిగింది. రెండు విడతలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా కూటమిలోని జనసేన, బీజేపీతో పాటు తమ పార్టీ నేతలకు పంచాల్సి రావడంతో అందరికీ అవకాశం ఇవ్వలేకపోయారు. ఇప్పుడు మూడో దఫా జాబితాను విడుదల చేస్తామని సిద్ధంగా ఉండాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఉగాది నాటికి మూడో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తారని అందరూ భావించారు. కానీ ఉగాది వెళ్లి పోయినా నామినేషన్ పోస్టుల ఊసే లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లలో నిరాశ కనపడుతుంది.వచ్చే మహానాడుకు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. మహానాడుకు ఇంకా రెండు నెలలకు పైగానే సమయం ఉంది. గత ఏడాది సెప్టంబరులో తొలి జాబితాను చంద్రబాబు విడుదల చేశారు. మొత్తం ఇరవై కార్పొరేషన్లను నాడు భర్తీ చేశారు. దాదాపు తొంభయి తొమ్మిది మందికి పదవులు లభించాయి. రెండో విడత నామినేటెడ్ పోస్టులను గత ఏడాది నవంబరులో భర్తీ చేశారు. 59 మందికి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. గత ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారితో పాటు పార్టీ కోసం శ్రమించిన వారికి పదవులను ఇస్తామని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటానని, వారి నుంచి పూర్తి స్థాయిలో పేర్లు అందలేదని కూడా చంద్రబాబు చెప్పారు.తాజాగా మూడో విడతగా ఏఎంసీ ఛైర్మన్ లతో పాటు మార్కెట్ కమిటీలతో పాటు దేవాదాయాలకు చెందిన కమిటీలను కూడా భర్తీ చేస్తామని చంద్రబాబు చెప్పారు. దీనిపై తమ్ముళ్లు ఆశలు పెట్టుకున్నారు. ఏడాది చూస్తుండగానే గడచిపోయిందని, ఇప్పటి వరకూ తమకు గుర్తింపు లభించలేదని వారు అంటున్నారు. కొన్ని రోజులుగా చంద్రబాబు నియోజకవర్గాల నుంచి నివేదికలను తెప్పించుకుని ఆయన కసరత్తు చేస్తున్నారు. మూడో విడత కూడా పూర్తిగా భర్తీ చేసే అవకాశం కనిపించడం లేదు. కొన్ని ఖాళీలుగా ఉంచి అసంతృప్త నేతలకు ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. నామినేటెడ్ పోస్టులకు అరవై వేల పైచిలుకు దరఖాస్తులు రావడంతో వాటిని వడపోత పట్టేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు.చిన్నదైనా, పెద్దదైనా నామినేటెడ్ పోస్టులకు ఎంపిక చేస్తే దాని బాధ్యతలను చేపట్టాలని చంద్రబాబు ముందుగానే నేతలకు సంకేతాలు పంపారు. టిక్కెట్లు కోల్పోయిన వారితో పాటు పార్టీకి కష్టకాలంలో పనిచేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పోస్టులను గుర్తించి భర్తీ చేయాలన్న నిర్ణయంతో పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నారు. అయితే ఇందులో కూడా బీజేపీ, జనసేనలకు కొన్ని కేటాయింపులు జరపాల్సి రావడంతో పాటు సామాజికవర్గాల వారీగా నియామకాలు చేపట్ట వలసి ఉండటంతో కసరత్తు సుదీర్ఘంగా సాగుతుంది.

# అమరావతి, విశాఖలపై ఫోకస్



**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:** కూటమి సర్కార్ అమరావతితో పాటు విశాఖ అభివృద్ధిపై కూడా ఫోకస్ పెట్టిందా.. విశాఖను ఆర్థిక రాజధానిగా మలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందా.. అమరావతి, విశాఖను కూటమి సర్కార్ రెండు కళ్లుగా భావిస్తుందా. ఈ రెండు నగరాల అభివృద్ధిని బ్యాలెన్సింగ్ చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందా.. అమరావతి, వైజాగ్ డెవలెప్‌మెంట్ కోసం ప్రభుత్వం ఏం చేయబోతోంది. ఏపీకి అద్భుతమైన రాజధానిని నిర్మించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల మంత్రం జపించినా కూటమికే జై కట్టారు ప్రజలు. వైసీపీ గెలిస్తే.. విశాఖ రాజధాని అవుతుందని తెలిసినా.. ఆ ప్రాంత ప్రజలు కూటమికే పట్టం కట్టారు. ఐతే విశాఖ ప్రజలు ఎక్కడ నిరుత్సాహ పడిపోకుండా కూటమి సర్కార్ పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తుందట.కూటమి సర్కార్ పవర్‌లోకి వచ్చిన డే వన్ నుంచి అమరావతి నిర్మాణపనుల విషయంలో యాక్షన్ ప్లాన్‌ని రెడీ చేసుకొని ముందుకు వెళ్తోంది. అదే సమయంలో రాయలసీమ ఉత్తరాంధ్రాకు కూడా సమన్యాయం చేసేలా ప్రణాళికలను రూపొందించిందట కూటమి సర్కార్. అమరావతితో పాటు విశాఖకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను ఐటీ హబ్‌గానూ పారిశ్రామిక కేంద్రంగానూ తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాల్ని వాడుకుంటోంది. అలా విశాఖపట్నం వాసుల కలలను నెరవేర్చే పనిలో సక్సెస్ అవుతోందని లోకల్ టాక్.విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్.. ఈ ప్రాంతాన్ని ఐటీ హబ్‌గా మార్చుతామని ప్రకటించారు. విశాఖలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 5 లక్షల ఐటీ ఉద్యోగాలు వచ్చేలా చూస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ నగరంగా, ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ఏపీకే గొప్ప నగరంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారువిశాఖ గురించి గొప్పగా చెప్పడమే కాకుండా విశాఖకు కూటమి ప్రభుత్వం ఏమి చేసింది ఏమి చేయబోతోంది క్లారిటీ ఇచ్చేశారు లోకేశ్. ఇలా విశాఖ రాజసం కానీ రాజధాని హోదా కానీ ఎక్కడా తగ్గకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లేలా కనిపిస్తోందని లోకల్ పీపుల్స్ చర్చించుకుంటున్నారట.మంత్రి లోకేశ్ మొత్తం విశాఖ అభివృద్ధిపై ఫోకస్ పెడితే.. సీఎం చంద్రబాబు అమరావతి గురించి ఎక్కువగా చెబుతుంటారు. ఏ సభకు వెళ్లినా. ఏ కార్యక్రమానికి వెళ్లినా? అమరావతి అద్భుతంగా తీర్చుదిద్దుతామని చంద్రబాబు ప్రస్తావిస్తారు.ఇలా రెండు నగరాలను డెవలప్‌చేసేలా కూటమి సర్కార్ దూసుకెళ్తోందని అన్నివర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విషయంలో విశాఖ జనాలు కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారట. ఏది ఏమైనా అమరావతి, విశాఖ రెండింటినీ కరెక్ట్‌గా బాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నారని బలమైన టాక్ జనాల్లోకి వెళ్లిపోయిందట.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రోజుకో ట్విస్ట్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 2, పెన్ పవర్:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణపై రోజుకో ట్విస్ట్ వెలువడుతూనే ఉంది. ఇటీవలే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై తమ స్టాండ్ ఏమీ మారలేదు అంటూ కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీనిపై అక్కడి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే లేటెస్ట్‌గా విశాఖ ఉక్కు పరిశ్రమను బలోపేతం చేసే అంశంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర బృందం భేటీ అయింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపింది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి ప్యాకేజీని మంజూరు చేసిన తర్వాత తదనంతర పరిణామాలపైనా, తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ... రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మరోవైపు స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న 2 బ్లాస్ట్ ఫర్నేసులతో పాటు, 3వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసేందుకు తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక సాయం ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఉక్కు కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో సమర్థత, సామర్థ్యం పెంచుకోకపోతే ఆశించిన ఫలితాలు రావని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారని ఆయన కార్యాలయం తెలిపింది. ఈ సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్చార్జ్ సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కే వర్మ, ఎంఎస్‌టీసీ లిమిటెడ్ సీఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.

**కావలసింది కాప్టివ్ మైన్ : కార్మిక సంఘాలు**

వైజాగ్ స్టీల్ ప్లాంట్ను బలోపేతం చేయడం పై ప్రభుత్వాలు ముందుకు రావడం సంతోషమే అయినా వైజాగ్ స్టీల్ ప్లాంట్ బతకాలంటే దానికంటూ ప్రత్యేకమైన గనుల కేటాయింపు జరగాల్సిందేనని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ కార్మిక సంఘాలు అంటున్నాయి. ప్యాకేజీలతో తాత్కాలికంగా అప్పులు తీరినా శాశ్వతం గా స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి రావాలంటే ముడి ఖనిజ కేటాయింపు మాత్రమే మార్గమని వారు చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా అదే మాట చెబుతున్నాయి. ప్రభుత్వ కార్యాచరణ కూడా ఆ దిశగానే ఉండాలని ఆంధ్ర ప్రజల కోరిక.

# ఏటీఎం కార్డుల తరహాలో రేషన్ కార్డులు

**విజయవాడ, ఏప్రిల్ 2,పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు సైజులో ఉండే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులో క్యూఆర్ కోడ్, ఇతర సెక్యూరిటీ ఫీచర్లు ఉంటాయని నాదెండ్ల మనోహర్ తేల్చి చెప్పారు. కొత్త రేషన్ కార్డుల జారీ సహా వివిధ అంశాలపై ఏపీ సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరించారు. ఈ స్మార్ట్ కార్డులో కుటుంబ సభ్యులకు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని.. అది రేషన్ కార్డుగా కాకుండా ఫ్యామిలీ కార్డుగా ఉంటుందని తెలిపారు.ఇక రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు సంబంధించి కూడా మంత్రి నాదెండ్ల వివరించారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను జోడించడం.. ఉన్నవారి పేర్లను తొలగించడం.. స్ప్లిట్ కార్డులు అప్లై చేసుకునేందుకు ఆప్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఈ-కేవైసీ పూర్తైతే ఎంతమందికి రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని మనోహర్ చెప్పారు. ఈ నెలాఖరులోగా ఈ-కేవైసీ పూర్తి చేస్తామని.. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డులపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. మరోవైపు.. మంగళవారం నుంచే దీపం-2 రెండో విడత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమైనట్లు మంత్రి వివరించారు.రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు తీసుకువెళ్లి తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని వెల్లడించారు. అదే సమయంలో వాట్సాప్ ద్వారా కూడా రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా 16 వేల మంది రైతులు ఇప్పటివరకు ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. రైతుకు భరోసా కల్పించేలా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల అకౌంట్లలో నగదు జమ చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కన్నా 20 శాతం అధికంగా తాము ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు.రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణాలో 65 వేల మెట్రిక్ టన్నులను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మిల్లర్ అసోసియేషన్‌తో కూడా సమావేశాలు పెట్టినట్లు చెప్పారు. కాకినాడలో 3 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు చెకింగ్ జరుగుతోందని వెల్లడించారు. స్కూళ్లు, హాస్టళ్లలో సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# అలా అనకుండా ఉండాల్సింది: పంత్‌ను ఆడేసుకుంటున్న నెటిజన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 లో లక్నో సూపర్ జయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ఘోరంగా విఫలమవుతున్నాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఒక్క మ్యాచ్ లోనూ ప్రభావం చూపలేకపోయాడు. తనపై ఎంతో నమ్మకముంచి మెగా ఆక్షన్ లక్నో రూ.27 కోట్ల రూపాయలకు పంత్ ను దక్కించుకుంది. అయితే పంత్ మాత్రం బ్యాటింగ్ తో కెప్టెన్ గాను విఫలమవుతున్నాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్ ల్లో కేవలం 17 పరుగులు మాత్రమే చేశాడు. తొలి మ్యాచ్ లో డకౌట్ కాగా.. ఆ తర్వాత వరుసగా 17, 2 పరుగులు చేశాడు. మంగళవారం (ఏప్రిల్ 1) పంజాబ్ సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో పంత్ కేవలం రెండు పరుగులు మాత్రమే చేసి ఔట్ కావడంతో అతనిపై ట్రోల్స్ వస్తున్నాయి.

**అసలేం జరిగిందంటే..?**


ఆక్షన్ జరిగే సమయంలో నాకు ఒకే ఒక టెన్షన్ ఉందని.. పంజాబ్ కింగ్స్ తనను కొంటుందని భయపడ్డానని పంత్ చెప్పుకొచ్చాడు. అయితే పంత్ ఈ మాటలను సరదాగా అన్నట్టు అర్ధమవుతుంది. నిజానికి మెగా ఆక్షన్ ముందు అందరికంటే ఎక్కువగా పంజాబ్ కింగ్స్ వద్దే ఎక్కువ డబ్బు ఉంది. పంత్ కోసం పంజాబ్ భారీ మొత్తం వెచ్చించడానికి సిద్ధమైంది. అయితే పట్టు వదలకుండా లక్నో ఫ్రాంచైజీ పంత్ ను రూ. 27 కోట్ల రూపాయలకు దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలోనే ఒక ప్లేయర్ కు ఇది అత్యధిక శాలరీ కావడం విశేషం.

పంత్ సరదాగా అన్న మాటలను నెటిజన్స్ సీరియస్ గా తీసుకున్నారు. అతని ఓవర్ కాన్ఫిడెంట్ ఎక్కువ అని కామెంట్ చేస్తున్నారు. ఇక కొంతమంది పంజాబ్ జట్టును తక్కువగా అంచనా వేసి ఆ జట్టు చేతిలోనే ఘోరంగా ఓడిపోయారు అని చెప్పుకొచ్చాడు. తొలి రెండు మ్యాచ్ ల్లో విఫలమైన పంత్ మీద పెద్దగా విమర్శలు రాలేదు. కానీ పంజాబ్ మీద అతని పేలవ ప్రదర్శన అతన్ని ట్రోలింగ్ కు గురి చేశాయి. ప్రస్తుతం పంత్ సారధ్యంలోని లక్నో సూపర్ జయింట్స్ జట్టు ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఒకటి గెలిచి రెండు ఓడిపోయింది.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. బ్యాటింగ్‌లో దుమ్మురేపిన పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్-18లో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఛేజింగ్‌లో ప్రభ్‌సిమ్రన్ సింగ్ (34 బాల్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 69), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (30 బాల్స్‌లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52 నాటౌట్), నేహల్ వాధేర (25 బాల్స్‌లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 43 నాటౌట్) దంచికొట్టడంతో మంగళవారం (April 1) జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన లక్నో 20 ఓవర్లలో 171/7 స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ 16.2 ఓవర్లలో 177 పరుగులు చేసి గెలిచింది.

# టెస్ట్ కాదు అంతకుమించి: జిడ్డు బ్యాటింగ్‌తో విసిగించిన పాక్ స్టార్ ప్లేయర్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రేమికులు అందరూ ప్రస్తుతం ఐపీఎల్ తో బిజీగా ఉంటే.. మరోవైపు పాకిస్థాన్ మాత్రం టెస్ట్ బ్యాటింగ్ తో విసుగు తెప్పించింది. బుధవారం (ఏప్రిల్ 2) న్యూజిలాండ్ తో జరిగిన మ్యాచ్ రెండో వన్డేలో పాక్ టాపార్డర్, మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ చేయడానికి ఇబ్బందిపడ్డారు. 293 పరుగుల లక్ష్యం ఎదురుగా కనిపిస్తున్నా జిడ్డు బ్యాటింగ్ ఆడారు. హామిల్టన్ వేదికగా సెడాన్ పార్క్ లో జరిగిన ఈ మ్యాచ్ లో పాకిస్థాన్ 84 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్ లో ఛేజింగ్ చేస్తున్నప్పుడు పాక్ స్టార్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. భారీ లక్ష్య ఛేదనలో తొలి 10 ఓవర్లలో కేవలం 28 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయారు. 15 ఓవర్లు ముగిసేసరికి 49 పరుగులకు సగం జట్టు పెవిలియన్ చేరింది. పవర్ ప్లే లో కివీస్ బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ బ్యాటర్ల దగ్గర సమాధానం లేకుండా పోయింది. ముఖ్యంగా పాక్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ టెస్ట్ బ్యాటింగ్ ను గుర్తు చేశాడు. 27 బంతుల్లో కేవలం 5 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఇక ఓపెనర్ అబ్దుల్ షఫీక్ 11 బంతుల్లో ఒక పరుగు మాత్రమే చేయగా.. మరో ఓపెనర్ ఇమాముల్ హక్ 12 బంతుల్లో 3 పరుగులు చేసి పెవిలియన్ కు చేరాడు. తొలి మ్యాచ్ లో హాఫ్ సెంచరీ చేసి టచ్ లోకి వచ్చిన బాబర్ అజామ్ ఒక పరుగుకే ఔటయ్యి తీవ్రంగా నిరాశపరిచాడు. సల్మాన్ అఘా 15 బంతుల్లో 9 పరుగులు.. తయ్యబ్ తాహీర్ 29 బంతుల్లో 13 పరుగులే చేయగలిగారు. లోయర్ ఆర్డర్ లో ఫహీమ్ అష్రాఫ్, నజీమ్ షా పోరాడి హాఫ్ సెంచరీలు చేయడంతో పాకిస్థాన్ ఘోర ఓటమి నుంచి బయటపడింది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 208పరుగులకు ఆలౌట్ అయింది. ఈ విజయంతో న్యూజి లాండ్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3 మ్యాచ్ ల వన్డే సిరీస్ ను 2-0 తేడాతో గెలుచుకుంది.

# రాజస్థాన్ రాయల్స్‌కు తీపి కబురు... సంజూ శాంసన్‌కు లైన్ క్లియర్

- ఐపీఎల్ కు ముందు సంజూ కుడి చేతి చూపుడు వేలికి గాయం
- గత 3 మ్యాచ్‌లలో కేవలం బ్యాటింగ్ మాత్రమే చేసిన వైనం
- తాజాగా ఫిట్‌నెస్ టెస్టుల్ని క్లియర్ చేయడంతో ఎన్‌సీఏ నుంచి గ్రీన్ సిగ్నల్
- వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని చేపట్టేందుకు సంజూకు లైన్ క్లియర్




**హైదరాబాద్ పెన్ పవర్:** సంజూ శాంసన్ తిరిగి రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) కెప్టెన్‌గా మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని స్వీకరించేందుకు ఆయనకు బీసీసీఐ ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఐపీఎల్ కు ముందు కుడి చేతి చూపుడు వేలికి గాయం కావడంతో గత మూడు మ్యాచ్‌లలో సంజూ కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఫిట్‌నెస్ టెస్టుల్ని క్లియర్ చేయడంతో బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతల్ని చేపట్టేందుకు సంజూకు లైన్ క్లియర్ అయింది. కాగా, సంజూ శాంసన్ స్థానంలో గత మూడు మ్యాచ్‌లకు యువ ఆటగాడు రియాన్ పరాగ్ సారథ్య బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో రాజస్థాన్ ఒకటి గెలవగా, మరో రెండింటిలో పరాజయం పాలైంది.

# డ్రాగన్ బ్యూటీ క్రేజ్ తగ్గట్టుగానే..!



మీనాక్షి చౌదరి పింక్ చీర మరియు అధునాతన ఆభరణాలలో స్టన్స్

ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు ఎప్పుడు పాపులర్ అయ్యామన్నది ముఖ్యం అన్నట్టుగా ఇండస్ట్రీకి వచ్చి ఎన్నాళ్లయ్యింది అన్నది కాదు. ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది హీరోయిన్స్ కి లెక్క ఉంటుంది. అలా చేస్తున్న సినిమాలతో సినిమా సినిమాకు తమ రేంజ్ పెంచుకునే వారిలో చాలామంది భామలు ఉండగా వారిలో కొత్తగా డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ చేరింది. ప్రదీప్ రంగనాథన్ తో డ్రాగన్ సినిమాలో అమ్మడు నటించగా ఆ సినిమాతో సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది.ఐతే ఈ సినిమాలో ఆమె పర్ఫార్మెన్స్ కి అదిరిపోయే మార్కులు పడ్డాయి. డ్రాగన్ ముందు వరకు కయదు రేంజ్ వేరు. ఆ సినిమా రిలీజ్ అయ్యాక కయదు లెవెల్ మారిపోయింది. డ్రాగన్ హిట్ తో యూత్ లో కయదుకి సూపర్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఐతే డ్రాగన్ బ్యూటీ తన పాపులారిటీకి తగినట్టుగానే ప్లానింగ్ చేస్తుంది. ఇప్పటికే తెలుగు, తమిళ్ లో వరుస ఆఫర్లు అందుకుంటుంది కయదు. అనుదీప్ కెవి, విశ్వక్ సేన్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో అమ్మడు లక్కీ ఛాన్స్ అందుకుంది. జాతిరత్నాలు సినిమా డైరెక్టర్, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరో కాబట్టి ఈ సినిమా తప్పనిసరిగా కయదుకి మంచి హిట్ ఇస్తుందని నమ్ముతున్నారు. ఇదిలాఉంటే అమ్మడు సోషల్ మీడియా లో కూడా సందడి చేస్తుంది.ఆడియన్స్ లో తనకు వచ్చిన ఈ ఐడెంటిటీని మరింత పెంచుకునేలా చేస్తుంది కయదు లోహార్. అమ్మడు ఇలా ఫోటో షేర్ చేస్తే చాలు అలా వైరల్ అయిపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు ఆడియన్స్ అయితే కయదు అంటే చాలా క్రేజీగా ఉన్నారు. ఆల్రెడీ కయదు టాలెంట్ చూసే శ్రీవిష్ణు అల్లూరి సినిమాకు ఆమెకు తీసుకున్నాడు. కానీ ఆ సినిమా వర్క్ అవుట్ కాకపోవడంతో ఆమెను ఎవరు పట్టించుకోలేదు. డ్రాగన్ సినిమా సక్సెస్ తర్వాత శ్రీవిష్ణు అల్లూరి సినిమా వీడియోస్ ట్రెండ్ అయ్యాయంటే కయదుకి తెలుగులో ఉన్న ఫాలోయింగ్ ఎలాంటిదో అర్ధం చేసుకోవచ్చు. ఐతే పాపులారిటీ అందరికీ వస్తుంది కానీ దాన్ని సక్సెస్ ఫుల్ కెరీర్ గా మలచుకోవడంలోనే కథానాయికల క్లవర్ నెస్ ఆధారపడి ఉంటుంది. అందుకే కయదు కూడా మంచి ప్లానింగ్ తోనే సినిమాలు చేస్తున్నట్టు తెలుస్తుంది. మరి తెలుగులో అమ్మడికి వచ్చిన ఈ క్రేజ్ తో స్టార్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లేలా తన సినిమాల సెలక్షన్ ఉంటుందా లేదా అన్నది చూడాలి.





అనన్య నాగల్లా తన అద్భుతమైన హెూలీ లుక్‌ను పంచుకుంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com